VISALAANDHRA VIJAYAWADA Phone No 376

రిజిస్టర్డు నెం. [illegible] 4 పేజీలు : ఒక అణా

ఉగాది ప్రత్యేక సంచికలో

[illegible]
శ్రీకాకుళం [illegible]
ఆంధ్రుల [illegible]
నవీన కవితా [illegible]
మహాకవి గురజాడ గేయం
విప్రయోగం (నాటిక)
ప్రేమచంద్ : గోదాన్ (నవల)
తదితర వ్యాసాలు, గేయాలు

విశాలాంధ్ర

JOSS16

సంపుటి 2 విజయవాడ: శనివారం; ఏప్రిల్ 3; 1954 ★ సంచిక 375

పాక్ టర్కీ ఒడంబడికపై సంతకాలు

కరాచీ, ఏప్రిల్ 2

పాకిస్తాన్, టర్కీ ప్రభుత్వాలు నేడు పరస్పర సహకారసంధిపై ఇక్కడ సంతకాలు చేశాయి. సైనిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో ఈ రెండు ప్రభుత్వాల పరస్పర సహకారం దీని లక్ష్యం.

ఈ ఒడంబడికలో తామిప్పట్లో చేరదలచుకోలేదని ఇరాన్, సౌదీ అరేబియా ప్రభుత్వాలు అరబ్బు లీగు రాజకీయ కమిటీకి వాగ్దానం చేశాయని కైరోలో వార్త. ఏ అరబ్బు దేశమూ ఒడంబడికలో చేరదలచుకోలేదని ఆ కమిటీ ఒక అధికార ప్రకటన చేసింది.

గుంటూరులో ఆంధ్ర హైకోర్టు స్థాపనకు కేంద్రం ఆమోదం

మద్రాసునుండి ఆంధ్ర హైకోర్టు వాటా పంపిణీకి జస్టిస్ శ్రీ కోకా సుబ్బారావుగారి నియామకం

మరో హైడ్రోజన్‌బాంబు ప్రయోగానికి అమెరికా సన్నాహం

ఈసారి మునుపటికన్నా పెద్దబాంబును పేల్చుతారట

వాషింగ్టన్, ఏప్రిల్ 2

ఈ నెలలో మరొక హైడ్రోజన్ బాంబు ప్రయోగానికి అమెరికా ప్రభుత్వం సన్నాహాలన్నీ పూర్తిచేసిందనీ, ఈసారి ప్రేల్చబడే బాంబు మునుపటి రెండుసార్లు ప్రయోగించిన బాంబుల కన్నా చాల పెద్దదనీ అధికారవర్గాలతో సంబంధం కలవారు తెలిపారు.

బ్రిటన్‌లో హైడ్రోజన్ బాంబు నిలవలు

కామన్సుసభలో ప్రశ్నోత్తరాలు

లండన్, ఏప్రిల్ 1

హైడ్రోజన్ బాంబు సమస్య సందర్భంలో ఈ వేళ బ్రిటనులోని అమెరికన్ విమాన, సైనికస్థావరాల విషయం కామన్సు సభలో చర్చకు వచ్చింది.

బ్రిటన్‌లోని తమ స్థావరాలలో అమెరికన్లు హైడ్రోజన్ బాంబులను ‘ఎక్కువగా’ నిలవచేయకుండా బ్రిటిష్ ప్రభుత్వం చూడాలనీ, అది బ్రిటన్ క్షేమానికి అవసరమనీ లేబరుపార్టీ సభ్యుడొకడు చర్చిల్‌ని కోరాడు.

“దేశ క్షేమానికి అవసరమైన చర్యలన్నీ ప్రభుత్వం తీసుకుంటుంది” అని చర్చిల్ జవాబిచ్చాడు.

“చప్పుజవాబు” అని మరొక లేబరు సభ్యుడు అరిచాడు “చప్పుప్రశ్న” అని మరొక లేబరుసభ్యుడే దానికి జవాబుగా అరిచాడు

చర్చిల్ లేచి “బ్రిటన్‌లో అమెరికన్ స్థావరాలు ఉండడాన్ని ఇప్పటి ప్రభుత్వము నేడు సమర్థిస్తున్నప్పటికీ, అసలు వాటిని స్థాపించడానికి మొదట అనుమతి ఇచ్చింది లేబరు ప్రభుత్వమే అన్న విషయాన్ని మరచిపోయారా? ఈ స్థావరాల నిక్కడ నిర్మించనీయడం చాల అపూర్వమైనట్టి హైడ్రోజన్ బాంబులు, అటంబాంబుల విషయాల నన్నిటిని గురించి వాస్తవికంగా ఆలోచించే లేబరు ప్రభుత్వం ఆ అనుమతిని ఇచ్చిఉంటుందా”ని ఎత్తిపొడిచాడు

న్యూయార్కులో కంగారు

వాషింగ్టన్, ఏప్రిల్ 1

ఇక్కడ హైడ్రోజన్ బాంబు న్యూయార్కు నగరాన్నంతా సర్వనాశనం చేయగలదని, ఆ బాంబు శక్తిసామర్థ్యాలను వర్ణిస్తూ, అమెరికా ప్రభుత్వ అణుశక్తి కమిషన్ అధ్యక్షుడు లూయీ స్ట్రాస్ నిన్న చేసిన ప్రకటన న్యూయార్కులో ఎన్నడూలేని కంగారు పుట్టించింది.

హైడ్రోజన్ బాంబులతో యుద్ధమే వస్తే నగరాన్ని ఎలా కాపాడాలని నగర పౌరరక్షక అధికారులు అప్పుడే ఆలోచనలు ప్రారంభించారు. “నగరాన్ని పూర్తిగా ఖాళీ చేయడంతప్ప మరో మార్గం ఏదీలేదనీ, అందుకు ఒక్క మూడురోజులు ముందునోటీసు కావాలనీ” ఆ శాఖ అధ్యక్షుడు ఒక ప్రకటన చేశాడు.

1952 నవంబరులో జరిగిన ప్రథమ హైడ్రోజన్ బాంబు ప్రయోగం ఫిల్మును అమెరికా ప్రభుత్వం సరిగ్గా ఇదే సమయంలో ప్రదర్శనకు విడుదల చేసింది.

(మొన్న జరిగిన ప్రయోగాలు పూర్తిగా [illegible] చేసిన బాంబులను సంబంధించినవి.)

ఆ ఫిల్ము ప్రదర్శనా, న్యూయార్కు నగరం విషయమై సాగుతూన్న అడావిడీ, ప్రజాసామాన్యాన్ని నానా బేజారెత్తించేస్తున్నాయి.

హైడ్రోజన్ బాంబు ఉన్నది ఒక్క అమెరికాకే కాదనీ, అది సోవియటు వద్దకూడా ఉన్నదనే విషయం ఇక్కడి పత్రికలు దృష్టిలోఉంచుకొనే వ్యాఖ్యానిస్తున్నాయి.

కనడా విదేశాంగమంత్రిసలహా

“హైడ్రోజన్ బాంబు ప్రయోగ ఫలితాలనుబట్టిచూస్తే, “అణుశక్తికంట్రోలు విషయంలో నూతన దృక్పథాన్ని అలవరచుకోవలసిన అవసరం ఎంతైనా కనబడుతున్నద”ని కనడా విదేశాంగ మంత్రి లెస్టర్ పియర్సన్ ఈ వేళ అన్నాడు.

“మన సందర్భం, ప్రపంచంలోని అన్ని ప్రభుత్వాలూ ఈ కంట్రోలు విషయంలో ఇక ఏమాత్రం జాగు చేయడానికి వీల్లేద”న్నాడు.

జపానులోని ముఖ్య రాజకీయపార్టీలతీర్మానం

టోకియో, ఏప్రియల్ 1

అణుశక్తిపై తక్షణమే అంతర్జాతీయ అజమాయిషీని అమలుపరచాలని కోరుతూ జపాన్‌లో అయిదు ప్రధాన రాజకీయ పార్టీలు నేడొక సంయుక్త తీర్మానాన్ని జపాను పార్లమెంటులో ప్రతిపాదించాయి.

అణు ఆయుధాలను పూర్తిగా నిషేధించి, అణుశక్తి శాంతియుత ప్రయోజనాలకే వినియోగపర్చేందుకు తగిన చర్యలను వెంటనే తీసుకోవలసిందిగా ఆ తీర్మానం ఐ. రా. సమితిని కోరుతూంది.

అమెరికాకు జపాను డిమాండు

ఈ నెల మొదటి తేదీలో పసిఫిక్కులో అమెరికా జరిపిన హైడ్రోజన్ బాంబు ప్రయోగంలో జపాన్ జాలరి నావకు నష్టం కలిగినందుకు అమెరికా ప్రభుత్వం క్షమార్పణ చెప్పుకొని, నష్టపరిహారం ఇచ్చుకోవలసిందిగా కోరదలచామని జపాను విదేశాంగమంత్రి కాట్సువో ఒకజాకి నేడు ప్రకటించాడు.

అమెరికా అలాంటి ప్రయోగాలనన్నిటినీ తన భూభాగంలోగాని, తనకు చెందిన సముద్రాల్లోగాని చేసుకోవడం మంచిదని అతను అన్నాడు.

మానవత్వానికే అపచారం

బ్రిటిష్ చర్చి ఖండన

లండన్, ఏప్రిల్ 2

“హైడ్రోజన్ బాంబు ప్రయోగం భగవంతుని అపచారం. తూర్పు, పశ్చిమ దేశాలన్నీ దీనిని నిషేధించాలి” అని “చర్చి ఆఫ్ ఇంగ్లాండు టైమ్సు” పత్రిక నేడు ప్రకటించింది.

“కమ్యూనిస్టు దురాక్రమణ నుండి ఈ బాంబు సాటిలేని రక్ష అని కొంతమంది అనుకుంటున్నమాట నిజమే. అమెరికాకు దుష్టవాంఛ లేదు లేదన్న మాటకూడా నిజమే. అయినా ఈసందర్భంలో అదంతా అనవసరం. ఈ ఆయుధాన్ని ప్రయోగించడం మానవత్వానికే అపచారం” అని ఆ పత్రిక అన్నది.

4 హైడ్రోజన్ బాంబులతో ప్రపంచ వినాశనం

ఈ అయుధాల నిషేధానికి ఇండియా పోరాడాలని మేజర్ జనరల్ సోఖే హెచ్చరిక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3

కోబాల్టు పెట్టెలలో పెట్టిన, ఒక్కొక్కటి 100 టన్నుల బరువుగల నాలుగు హైడ్రోజన్ బాంబులు ప్రపంచంలో జీవితాన్నే సమూలంగా అంతమొందించగలవని ప్రఖ్యాత శాస్త్రవేత్త మేజర్ జనరల్ సాహెబ్ సింగ్ సోఖే నేడిక్కడ పత్రికాగోష్ఠిలో హెచ్చరించారు.

మేజర్ సోఖే అఖిలభారత శాంతి సంఘం ఉపాధ్యక్షుడు, పార్లమెంటు సభ్యుడుకూడా.

“ఈ నాలుగు బాంబులను పేల్చినట్టయితే, 960,000 టన్నుల రేడియంతో సమానమైన రేడియో ధార్మిక కణాలు ఉత్పత్తి అవుతాయి. ఈ కణాలు ప్రపంచంలో అన్నిభాగాలకు వ్యాపించి, 5 సంవత్సరాలపైగా శక్తినికలిగి వుంటాయి. వీటిని ఏ జీవపదార్థం స్పృశించినా అది నాశనమైపోగలదు”అని మేజర్ సోఖే చెప్పారు.

ఈబాంబుల విషయాన్ని ఐక్యరాజ్యసమితిలో చర్చకు తేవాలని ఇండియా ప్రభుత్వాన్ని సోఖే కోరారు. అణుశక్తి ఆయుధాలపై నిషేధం పూర్తిగావిధించబడేదాకా, ఇండియాలో ప్రజలందరూ ప్రభుత్వమూ, అందుకోసం పోరాడాలని విజ్ఞప్తి చేశారు.

పసిఫిక్ సముద్రంలో అమెరికా సాగిస్తున్న హైడ్రోజన్ బాంబు ప్రయోగాలను ప్రస్తావించి, ఈ ప్రయోగాలు ఆపివేయాలని శ్రీ సోఖే అన్నారు. ఈ ప్రయోగంవల్ల ఉత్పన్నమయ్యే రేడియో ధార్మిక కణాల ప్రభావం ఇండియాలోనూ, ఆసియాలో అనేక ప్రాంతాలలోనూ పడవచ్చునన్నారు.

“ఈ బాంబు ఉపయోగించబడకుండా చూడటానికి సరియైన మార్గమేమిటంటే, యుద్ధాన్ని నిషేధించాలి. అంతర్జాతీయ సమస్యలను సంప్రతింపులతో పరిష్కరించుకోవాలి.

మనం భౌగోళికంగా నిర్వహించవలసిన పాత్ర వున్నది. అమెరికా ఇంతవరకూ ఆసియావాసులను తన ప్రయోగాలకు సాధనాలుగా చేసుకుంది. అందుచేత ఈ ప్రయోగాలు జరిగే పక్షంలో మనం ఎక్కువగా ఆందోళన చెందవలసి వస్తున్నది. ఆసియావాసులపైనే మొదట అటంబాంబులు వేయబడ్డాయి. మళ్ళీ, ఆసియా ప్రజలకు ప్రమాదంకలిగించే విధంగా పసిఫిక్ సముద్రంలోనే కొత్త హైడ్రోజన్ బాంబులు పరీక్షించబడుతున్నాయి.

ప్రధాని నెహ్రూ, ఈ ఉన్మాద చర్యలను ఆపాలని పిలుపిచ్చారు. భారతీయ శాస్త్రజ్ఞులు ఈ పిలుపును అందుకోవాలి. ప్రజల నిర్మాణాత్మక కార్యాలకు ఉపయోగించబడవలసిన విజ్ఞానం మానవజాతి వినాశనానికి ఎలా దుర్వినియోగం పరచబడుతున్నదో శాస్త్రజ్ఞులు ప్రజలకు తెలియజేయాలి.

కోబాల్టు లేకుండా సామాన్యమైన హైడ్రోజన్ బాంబు ప్రయోగానికి అవసరమయ్యే పరిస్థితులలో పేల్చబడినప్పుడు ఆ ప్రమాదం చాల దూరం వ్యాపించినవిషయం మనం చూశాము. వందలాది మైళ్ళదూరంలోనున్న జపాన్ బెస్తవారిపై దాని ప్రభావం బాంబుప్రయోగం తర్వాత అనేక రోజులకు కనబడింది.

అమెరికా ప్రభుత్వం రెండవ ప్రపంచయుద్ధం తర్వాత అణుశక్తి విజ్ఞానాన్ని రాజకీయ సాధనంగా ఉపయోగించడమారంభించింది. అణ్వస్త్ర విజ్ఞానం ప్రపంచానికి, అమెరికాకుకూడా వినాశకరమవుతుంది.

ఈ ప్రయోగాలను ఆపాలని, హైడ్రోజన్ బాంబులు, ఇతర మారణాయుధాలను నిషేధించాలని కోరుతూ దేశమంతటా నిరసన సభలు జరపాలని అఖిలభారత శాంతి సంఘం భావిస్తున్నది. మనం విధిగా సాధించేదాకా ఈ ఉద్యమం నడపాలి.”

సోవియట్‌లో జీవితావసర సరకుల ధరతగ్గింపు

మాస్కో, మార్చి 31

సోవియట్‌లో ఆహార పదార్థాల, తదితర జీవితావసర సరకుల చిల్లరధరలను తగ్గిస్తూ సోవియటు ప్రభుత్వమూ, సోవియట్ కమ్యూనిస్టు కేంద్ర కమిటీ, నేడొక ప్రకటన చేశాయి. ఈ ధరల తగ్గింపు రేపటినుండే అమలులోకి వస్తుంది.

రెండవ ప్రపంచయుద్ధం ముగిసిన తరువాత ధరలను ఇదివరకే నాలుగుసార్లు తగ్గించారు. ఇది అయిదవసారి.

రొట్టె ధర నూటికి అయిదు మొదలు ఎనిమిదివంతులవరకు తగ్గిపోతుంది. టీ ధర నూటికి పదివంతులు, కాఫీ- కోకో ధర నూటికి 15 వంతులు, సిల్కుబట్టల ధర నూటికి పదివంతులు, నూలుబట్టల ధర నూటికి 15 మొదలు 20 వంతులు, జోళ్ళు మొదలైన పాదరక్షలధర నూటికి ఏడు మొదలు 20 వంతులు తగ్గుతుంది. చిల్లర సరకుల వెల నూటికి పది మొదలు 15 వంతుల వరకు తగ్గుతుంది. సబ్బు, అత్తరువుల ధర నూటికి పది మొదలు 20 వంతులు, నగలధర సగటున నూటికి పది పదిహేను వంతులు, గృహనిర్మాణ సరకులధర నూటికి పది మొదలు ఇరవై వంతులు, విద్యుత్ పరికరాల ధర నూటికి పది వంతులు తగ్గిపోతుంది.

మందుల ధరను ఇప్పుడున్న చాల తక్కువ ధరలకన్నా నూటికి పదిహేను వంతులు ఇంకా తగ్గించారు.

పెట్రోల్ ధరను నూటికి 44½ వంతులు తగ్గించారు.

బల్గేరియాలో కూడా

వియన్నా, మార్చి 31

బల్గేరియాలో ఆహారపదార్థాల, ఇతర వినిమయ సరకుల చిల్లర ధరను నూటికి అయిదు మొదలు ఎనిమిది వంతుల వరకు తగ్గిస్తూ బల్గేరియా ప్రభుత్వం ఒక ప్రకటన చేసింది.

* * *

సర్దార్ పటేల్ కొడుకు శ్రీ దహ్యాభాయిపటేల్ (కాంగ్రెస్) బొంబాయి మేయరుగా ఎన్నికొబడ్డారు. ఆయన శ్రీ వి. యస్. కెలిస్కర్ (ప్ర.సో.)ను 71-48 వోట్లతో ఓడించారు.

జూలై 5వ తేదీనుండి ప్రత్యేకహైకోర్టు ఏర్పాటు

[విశాలాంధ్ర విలేఖరి]

కర్నూలు, ఏప్రిల్ 2

ప్రత్యేక ఆంధ్ర హైకోర్టును జూలై 5వ తేదీన గుంటూరులో నెలకొల్పడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. హైకోర్టు స్థాపనకు అవసరమైన సన్నాహాలను చేయడానికి, ప్రస్తుత మద్రాసు హైకోర్టు నుంచి ఆంధ్ర హైకోర్టు వాటా పంపిణీని చూడ్డానికి న్యాయమూర్తి శ్రీ కోకా సుబ్బారావుగారిని ప్రత్యేకాధికారిగా కేంద్రప్రభుత్వం నియమించింది.

శ్రీ కోకా సుబ్బారావుగారితోపాటు మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి మరొకరు పరిశిష్ట మద్రాసు హైకోర్టు పక్షాన పంపిణీ వ్యవహారాలను చూస్తారు.

ప్రత్యేక హైకోర్టు స్థాపన విషయంలో ఆంధ్ర శాసనసభ చేసిన తీర్మానాన్ని ఆంధ్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ఇదివరకే పంపించిందన్న విషయం పాఠకులకు విదితమే.

ఆంధ్రహైకోర్టుకు నియమితులయ్యే ఏడుగురు న్యాయమూర్తులలో ముగ్గురు మద్రాసు హైకోర్టునుంచి వస్తారని తెలుస్తోంది. వారు శ్రీయుతులు కోకా సుబ్బారావు, కె. ఉమామహేశ్వరం, చంద్రారెడ్డిగార్లు.

న్యాయమూర్తి పత్తిపాటి సత్యనారాయణరావుగారు కొద్దిరోజులలోనే పదవీ విరమణ చేస్తున్నారు. కాబట్టి ఆయన ఆంధ్ర హైకోర్టుకు రావడమనే సమస్య ఉండదు.

ప్రత్యేకాధికారిగా నియమితులైన శ్రీ కోకా సుబ్బారావుగారు అటు మద్రాసు నిర్వహించవలసిన వ్యవహారాలతోపాటు ఇటు గుంటూరులో చేయవలసిన ఏర్పాట్లనుకూడా చూస్తారు.

తిరుపతి విశ్వకళా పరిషత్తు బిల్లు

ఈనెలాఖరుకు పూర్తి కావచ్చునట

కర్నూలు, ఏప్రిల్ 2

తిరుపతి విశ్వకళాపరిషత్తు బిల్లు ఈ నెలాఖరుకు పూర్తి కాగలదని, దాన్ని ప్రభుత్వం వాల్తేరులో జరగబోయే శాసనసభ సమావేశంలో ప్రవేశపెడుతుందని తెలుస్తోంది.

ఆంధ్ర మంత్రులూ, ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ వి. యస్. కృష్ణ, శ్రీ గోవిందరాజులు నాయుడు, శ్రీ రంగధామరావు, శ్రీ కుప్పుస్వామి గార్ల సమావేశంలో తిరుపతి విశ్వకళాపరిషత్తుబిల్లు ముసాయిదాపై చర్చలుజరిపారు. ఈ బిల్లును సమాచారంకోసం త్వరలోనే ప్రకటించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

తిరుపతి విశ్వకళా పరిషత్తు వచ్చే విద్యా సంవత్సరంనుంచి ప్రారంభమౌతుందని, ముందు సైన్సు ఆనర్సు తరగతులతో ప్రారంభమౌతుందని అంటున్నారు. రసాయనభౌతిక శాస్త్రాలకు ఇప్పుడు తిరుపతిలోవున్న ప్రయోగశాల (లేబరేటరీ) సరిపోతుందని, తర్వాత ఆర్నెల్లలో క్రమంగా కావలసిన పరికరాలు కొనవచ్చునని వారు నిర్ణయించారు.

ఈ కొత్త విశ్వకళా పరిషత్తు స్థాపన వల్ల కలిగే మార్పులకోసం, ఆంధ్ర విశ్వకళా పరిషత్తు చట్టాన్ని సవరించవలసిన అవసరంకూడా వుంది. కనుక వాల్తేరు సమావేశంలోనే ప్రభుత్వంవారు ఆంధ్ర విశ్వకళా పరిషత్తు సవరణ బిల్లును కూడా ప్రవేశపెడతారు. (వి. వి.)

* * *

కటక్, పూరీ, బాలసోర్ జిల్లాలలోని పట్టణ ప్రాంతాలలో ఒరిస్సా ప్రభుత్వం మద్యనిషేధం ప్రవేశపెట్టింది.

వాల్తేరులో శాసనసభ సమావేశానికి సన్నాహాలు

కర్నూలు, ఏప్రియల్ 2

వాల్తేరులో మే 10వ తేదీ నుండి ఆంధ్ర శాసనసభ సమావేశం ప్రారంభమౌతుంది. ఈ సమావేశం దాదాపు 20 రోజులపాటు జరుగుతుంది.

అక్కడ శాసనసభకు కావలసిన ఏర్పాట్లు చేయడంకోసం శ్రీ జి. వి. చౌదరిగారు రేపురాత్రి బయలుదేరి విశాఖపట్నం వెళుతున్నారు. ఆయన అక్కడ వారంరోజులపాటు వుండి తగు ఏర్పాట్లు చేస్తారు. (వి. వి.)

విద్యాశాఖ డైరెక్టరుగా శ్రీ డి. ఎస్. రెడ్డిగారి నియామకం

కర్నూలు, ఏప్రిల్ 2

ఆంధ్ర విద్యాశాఖ డైరెక్టరుగా శ్రీ డి. ఎస్. రెడ్డిగారు నియమించబడ్డారు.

ఈయన లోగడ ఉమ్మడి మద్రాసు విద్యాశాఖ డైరెక్టరుగా వుండేవారు. ఆ తర్వాత ఐ. రా. స. విద్యాశాఖలో ఉద్యోగిగా వున్నారు. ఇప్పుడాయనను ఆంధ్ర ప్రభుత్వం ఆంధ్ర విద్యాశాఖ డైరెక్టరుగా నియమించారు. (వి. వి.)

అట్లాంటిక్‌కూటమిలో రష్యా సభ్యత్వానికి బ్రిటన్ విముఖత

కామన్సు సభలో ఈడెన్ ప్రకటన

లండన్, ఏప్రిల్ 2

ఉత్తర అట్లాంటిక్ కూటమిలో చేరడానికి సుముఖతను తెలుపుతూ సోవియటు ప్రభుత్వం పంపిన సూచనను బ్రిటిషు ప్రభుత్వం నేడు నిరాకరించింది.

ఈ నిరాకరణను కామన్సు సభలో నేడు వెల్లడిస్తూ, బ్రిటిష్ విదేశాంగ మంత్రి ఈడెన్, “అట్లాంటిక్ కూటమిలో సోవియట్ చేరినంతమాత్రాన ఆ సంస్థ సభ్యులకు తగినంత నమ్మకం కుదరద”న్నాడు. తమ స్వేచ్ఛా జీవనానికి ఆ సంస్థ రక్షణా దుర్గం అని అందులోని సభ్యులంతా ఇంతవరకు ధైర్యంగా ఉన్నారన్నాడు.

సోవియట్ లేఖను గురించి అమెరికా, ఫ్రాన్సు ప్రభుత్వాలతో బ్రిటిష్ ప్రభుత్వం సమగ్ర సమాలోచనలు జరుపుతుందని, ఈలోగా చెప్పవలసిన మాటలను చెప్పానని అతనన్నాడు.

“యూరప్ రక్షణకు జర్మనీ సేనలు తోడ్పడడాన్ని సోవియట్ ప్రభుత్వం ఈ లేఖలో కూడా వ్యతిరేకించింది. ఈ లేఖలో కూడా, ఇప్పుడున్న రూపంలో అట్లాంటిక్ కూటమి దురాక్రమణ సంస్థ అని విమర్శించింద”న్నాడు.

అసలు అట్లాంటిక్ కూటమి ఏర్పడడానికి సోవియట్ విధానాలే మూలకారణమని ఆరోపించాడు.

యూరప్ భద్రతకు, ప్రపంచ భద్రతకు తను పెంపొందించగల ప్రతివిషయాన్ని గురించీ శ్రద్ధగా ఆలోచించేందుకు బ్రిటిష్ ప్రభుత్వం సర్వదా సిద్ధమని ఈడెన్ అన్నాడు.

అట్లీ లేచి, “సోవియట్ సూచనను అమెరికా నిరాకరించినప్పుడైనా లేక, తన మిత్రరాజ్యాలతో సంప్రదించేందుకు అమెరికా సిద్ధంగా ఉన్నదా?” అని అడిగాడు.

“ఇందుకు సంబంధించిన ఇతర దేశాలతో సంప్రదిస్తామని అమెరికావారు 2వ ప్రకటన చేశారు. కాని, దానితోపాటు, ఎవ్వరితోనూ సంప్రదించకుండానే కొన్ని అభిప్రాయాలను వెలిబుచ్చారు,” అని ఈడెన్ జవాబు చెప్పగానే సభ్యులు “సిగ్గు, సిగ్గు” అని అరిచారు. (అట్లాంటిక్ కూటమిని భగ్నం చేసేందుకు సోవియట్ పన్నిన పన్నాగమే ఈ సూచనఅని అమెరికా విదేశాంగశాఖ నిన్నటి తన ప్రకటనలో విమర్శించింది.)

జార్జి థామస్ అనే లేబరు సభ్యుడు ఇలా అన్నాడు:

“అమెరికా తన ఇష్టంవచ్చిన విధానాలను ప్రకటించడం చూచిచూచి మనకు యిప్పటికే విసుగెత్తిపోయింది. అంతర్జాతీయ ఉద్రిక్తతను తగ్గించాలని ప్రజలందరూ కోరుతూన్న ఈ సమయంలో, అందుకు తోడ్పడగల ఈసూచనను అమెరికా నిరాకరించింద”ని విమర్శించాడు.

అమెరికా విదేశాంగశాఖ ప్రకటన

వాషింగ్టన్, ఏప్రిల్ 1

యూరప్ సమిష్టి భద్రతకై ఒక ఒడంబడికను గురించీ, అట్లాంటిక్ కూటమిలో సోవియటు చేరడం గురించీ సోవియటు ప్రభుత్వం పంపిన సూచనపై అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సు ప్రభుత్వాలు వెంటనే పరస్పర సమాలోచనలు జరుపుతాయని అమెరికా విదేశాంగశాఖ నేడొక ప్రకటన చేసింది.

ఈ ప్రకటనను వెల్లడిస్తూనే, సోవియట్ ప్రతిపాదననునిరాకరిస్తూ ఈశాఖ మంత్రి చేసిన ప్రకటనకన్నా తాను చెప్పగలది మరేమీలేదని కూడా ఆశాఖ ప్రతినిధి హెన్రీ సుయిడామ్ అన్నాడు.

* * *

భాక్రానంగల్ ప్రాజెక్టు నిర్మాణంలో 57 గురు అమెరికన్ నిపుణులు

పంజాబు ఆర్థిక మంత్రి వెల్లడి

చండీగర్, ఏప్రిల్ 1

భాక్రానంగల్ ప్రాజెక్టునిర్మాణంలో 57 అమెరికన్ నిపుణులు ప్రస్తుతం పనిచేస్తున్నారని నేడు పంజాబు లెజిస్లేటివ్ కౌన్సిల్లో రాష్ట్ర ఆర్థికమంత్రి సర్దార్ ఉజ్వలసింగ్ తెలియజేశారు. ఈ నిపుణులకోసం 1953 - 54 సంవత్సరంలో 70 లక్షల 98 వేలు రూపాయలను ఖర్చు పెట్టినట్లు కూడా ఆయన చెప్పారు.

హైడ్రోజన్ బాంబు ప్రయోగాలను ఆపివేయాలని నెహ్రూ ప్రకటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2

పరిశోధనకై హైడ్రోజన్ బాంబులను ఇకనెంతమాత్రమూ ప్రయోగించబోమని, అందుకు ప్రధానంగా సంబంధించిన ప్రభుత్వాలు వెంటనే ఒక ఒడంబడికచేసుకోవాలని, ప్రధాని నెహ్రూ నేడు ప్రజాసభలో ఒక ప్రకటన చేశారు. ఈ బాంబుల ఉత్పత్తినీ, నిలవనూ మానుకోడానికి ఇంకా సమగ్ర ఒడంబడికలు అవసరం అయినప్పటికీ, ప్రస్తుతానికి ఇటువంటి ‘నిలుపుదల’ ఒడంబడిక అత్యవసరమన్నారు.

డీన్ బీన్ ఫూ తూర్పు రక్షణ ప్రాకారంలో తూట్లు

హాంకాంగ్, ఏప్రిల్ 1

డీన్ బీన్ ఫూ దుర్గంపై నిన్న ప్రారంభించిన కొత్త ముట్టడిలో, తూర్పు దిక్కున ఆ దుర్గపు రక్షణ ప్రాకారంలోని మూడు స్థావరాలను పూర్తిగా ధ్వంసంచేశామని వియత్ మిన్ అధికారులు చేసిన ప్రకటనను వియత్ మిన్ రేడియో నేడు ప్రసారించింది.

తూర్పుదిక్కున ఆ దుర్గ రక్షణకు ఫ్రెంచివారు మొత్తం అయిదు స్థావరాలను నిర్మించారు. వాటిలో మూడు ధ్వంసం కావడంతో ఆ రక్షణశ్రేణి అంతా శిథిలావస్థకువచ్చింది. ఉత్తరాన ఆదుర్గరక్షణ శ్రేణిని వియత్ మిన్ ప్రజాసేనలు ఇదివరకే పూర్తిగా ధ్వంసం చేశాయి.

నిన్నటి విజయంలో మొత్తం రెండు ఫ్రెంచి పటాలాలు ధ్వంసమయాయని వియత్ మిన్ రేడియో తెలిపింది. ఫ్రెంచి ఆయుధ గిడ్డంగులను కొన్నిటిని వియత్ మిన్ ఫిరంగులు పేలగొట్టాయనీ, తమ విమాన విధ్వంసక ఫిరంగులు ఒక అమెరికన్ యుద్ధ విమానాన్ని కూడా నేలకూల్చాయనీ, ఆ రేడియో తెలిపింది.

దక్షిణ వియత్‌నాంలో ఈ సంవత్సరం మొదటి మూడు మాసాల్లో సాధించిన ఘనవిజయాలకు అక్కడి ప్రజాసేనలను అభినందిస్తూ వియత్ మిన్ సర్వసేనాని గువాన్ యెన్ గియాప్ ఒక సందేశాన్ని పంపాడని వియత్ మిన్ రేడియో తెలిపింది.

దక్షిణ వియత్‌నాంలో ఈ మూడు మాసాల్లోనూ ప్రజాసేనలు మొత్తం మూడు వందల ఫ్రెంచి సైనిక స్థావరాలను, అనేక పహారా బురుజులను ధ్వంసం చేశాయి. ఫ్రెంచి రోడ్లు, నౌకా రవాణా మార్గాలను, రేడియో సంబంధాలనుకూడా చిందరవందర చేశాయి.

ఈ విజయాలను బాగా బలపరచుకొని విస్తరించుకోవాలని ఆ సేనలకు గియాప్ విజ్ఞప్తి చేశాడు.

మార్చి 1వ తేదీనాటికి ఆరుమాసాల్లో ఆగ్నేయ వియత్నాంలో ప్రజాసేనలు మొత్తం 2828 మంది ఫ్రెంచి సైనికులను హతమార్చాయనీ, ఫ్రెంచి సేనలపై 998 సార్లు దాడులు చేశాయనీ, నవచైనా వార్తాసంస్థ తెలిపింది.

డీన్ బీన్ ఫూ లోని ఫ్రెంచిసేనలు బాగా అలసిపోయాయనీ, వాటి బలం సన్నగిలిపోతూందనీ ఫ్రెంచి అధికారులు చేస్తున్న ప్రకటనలే బయటపెడుతున్నాయి. ఎన్ని విమానాలు, ఎన్నిసార్లు ఎగిరి ఈ సేనలకు సప్లయిలను, సహాయాన్ని అందచేయగలవు అన్న దానిపైనే, ఆ సేనలింకా ఎంతకాలం నిలువగలవనేది ఆధారపడి ఉన్నదని ఫ్రెంచి వార్తా సంస్థల ప్రకటనలు తెలుపుతున్నాయి.

1954 ఏప్రిల్ 3 శనివారం
విజయ సంవత్సర
ఫాల్గుణ – బహుళ
అమావాస్య రా. 6–30
ఉత్తరాభాద్ర ప. 12–49

విశాలాంధ్ర

3-4-54 శనివారం

గుంటూరు సమ్మె

గుంటూరులో మున్సిపల్ కార్మికుల సమ్మె ప్రారంభమై నేటికి 12 రోజులయింది.

అక్రమంగా తొలగింపబడిన 14 గురు గ్యాంగు పనివారలను తిరిగి పనిలోకి తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు. ఒక్కొక్క పనివానికి 40 చొప్పున యివ్వాలనీ, ప్రతికార్మికునికీ జీతం నెలకు రు. 2 చొప్పున పెంచాలనీ, సమ్మెకు కారకుడైన సివిల్ ఇంజనీరును బదిలీ చేయాలనీ, సమ్మెరోజులకు జీతాలివ్వాలనీ కూడ కార్మికులు కోరుతున్నారు.

ఈ సమస్య మార్చి 30 వ తేదీని మున్సిపల్ కౌన్సిల్‌లో చర్చకు వచ్చినప్పుడు తొలగింపబడిన కార్మికుల్ని తిరిగి పనిలోకి తీసుకోవాలనే తీర్మానం అధిక సంఖ్యాక సభ్యుల ఆమోదాన్ని పొందింది. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి మరో రు. 6 వేలు ఖర్చు చేయాలనే ప్రతిపాదన వీగిపోయింది. కార్మికుల యితర కోర్కెలను విచారించడానికొక ఉపసంఘం నియమింపబడింది.

కాని, ఛైర్మన్ వర్గం యీ నిర్ణయాలను అమలు జరపకుండా సమ్మెను ఎలాగైనా విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిసున్నారు. తొలగింపబడిన వారిని తిరిగి తీసుకోకపోవడమేగాక మద్రాసు నుంచి పోటీ కార్మికుల్ని తీసుకొచ్చి పోలీసు కాపలా క్రింద వారిచేత పనిచేయిస్తున్నట్లు తంతు నడుపుతున్నారు.

స్థానిక స్వపరిపాలన శాఖా మంత్రి తిమ్మారెడ్డిగారిని నర్సారావుపేటలో కలుసుకున్న మీదట మున్సిపల్ ఛైర్మన్ వర్గంవారు ఇటువంటి అసంగత వైఖరి నవలంబించటం చూస్తే తిమ్మారెడ్డిగారు సైతం ఇందుకు మద్దతు యిచ్చినట్లు స్పష్టమవుతోంది.

బాధ్యత గల స్థానంలోఉన్న మంత్రి తిమ్మారెడ్డిగారు కార్మికుల న్యాయమైన కోర్కెలను మున్సిపల్ పాలకవర్గంచే ఆమోదింపజేసి తగవును పరిష్కరించుటకు తోడ్పడే బదులు విషమింపజేసే వైఖరి నవలంబించటం చూస్తే పార్టీక రాజకీయాలకే తప్ప ప్రజా క్షేమానికి ప్రాధాన్యత యిచ్చినట్లు కనపడదు. ఇది వారి అధికారాన్ని దుర్వినియోగ పరచుకోవటం తప్ప వేరుకాదు.

ఇప్పటికే, సమ్మెనువిచ్ఛిన్నం చేయడానికి అనకాపల్లి నుంచి తీసుకొచ్చిన పోటీ కార్మికుల తల్లులు, భార్యలు సత్యాగ్రహం చేయడం, వారి కోర్కెను బలపరుస్తూ మొత్తం మున్సిపల్ కార్మికులంతా సమ్మె చేయడం పాఠకులకు విదితమే. గుంటూరు మున్సిపల్ పాలకుల చర్యను గర్హిస్తూ ఆంధ్ర దేశం పలువైపుల నిరసన తీర్మానాలు చేస్తున్నారు.

ఈవిధంగా, ప్రజాభిప్రాయం గుంటూరు అధికార్లకు వ్యతిరేకంగా ఉందనేవిషయం స్పష్టం. ఈ విషయం గ్రహించకుండా, గుడ్డిగా పోటీ కార్మికుల్ని తీసుకొచ్చి తంతు నడపడం, సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రజల ధనాన్ని దుర్వినియోగంచేయడం గర్హ్యణీయం.

గుంటూరు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం కంటె కార్మికులను లొంగదీయాలనేదే ప్రధానంగా ఎంచే ఇట్టి అనుచిత వైఖరిని విడనాడాలనీ, కౌన్సిల్ చేసిన నిర్ణయాన్ని అమలుచేయాలనీ, మున్సిపల్ పరిపాలకవర్గాన్ని హెచ్చరించుచున్నాం. వివాదాన్ని సక్రమంగా పరిష్కరించటానికి తక్షణచర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికికూడా విజ్ఞప్తి చేస్తున్నాం.

జవుళి మిల్లులలో రేషనలైజేషన్

అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు విమర్శ

బొంబాయి, మార్చి 31

జవుళి పరిశ్రమలో రేషనలైజేషన్ పట్ల వ్యతిరేకత తెలుపుతూ అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు నేడొక ప్రకటనచేసింది. ఇది రక్షణలేని కార్మికులపై దాడిచేయడమే నన్నది. మిల్లులలో 2 లక్షలమంది నేత పనివారిలో 180000 మంది నిరుద్యోగు లవుతారని తెలిపింది.

"దేశంలో నిరుద్యోగం హెచ్చుపెరిగిపోతుండగా, ప్రభుత్వం ఈ సూచనలను బలపరచడంమాత్రే, ఎవరిప్రయోజనాలు ప్రభుత్వం బలపరుస్తుందో తెలుస్తుంది ప్రభుత్వం పరిశీలిస్తున్న సూచనలు ప్రజలను ఇంకా బీదవారిగా చేయడానికి, వారిని ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని ఇనుమడింప చేయడానికి తోడ్పడుతుంది."

పడిపోతున్న జీవన ప్రమాణాలు ఇంకా తగ్గించడానికి జరుగుతున్న ప్రయత్నాలను నిరోధించ బూనుకోవలసిందిగా కార్మికవర్గానికి అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కార్యవర్గం పిలుపిచ్చింది.

విజయవాడ రేడియో స్టేషన్ అభివృద్ధి

ఆంధ్ర ప్రభుత్వానికి శ్రీ కాళేశ్వరరావుగారి సూచన

విజయవాడ, మార్చి 31

విశాఖపట్టణం, కర్నూలు నగరాలలో కొత్తగా రేడియో స్టేషనులు నిర్మించాలనిచేసే ప్రయత్నాలు అట్టిపెట్టి, కేవలం ఒక కిలోవాటు మీడియం వేవ్ ట్రాన్స్‌మిటరుతో పనిచేస్తున్న విజయవాడ రేడియో స్టేషన్‌ను అభివృద్ధిపరచడానికి ఆంధ్ర ప్రభుత్వం ముందుకు రావాలని శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు ఒకప్రకటనలోసూచించారు.

కేంద్ర ప్రభుత్వం అధీనంలోవున్న 8 యాభై కిలోవాట్ల మీడియం వేవ్ ట్రాన్స్‌మిటర్లలో 7 ఖర్చయిపోగా, మరొకటి ఇంకా మిగిలి వున్నట్లు తనకు వర్తమానం అందినదనీ, ఆంధ్రప్రభుత్వం వేగిరపడి దానిని విజయవాడకు తెప్పించి పెట్టేందుకు కృషి చేయాలని కోరారు.

ఇజ్రాయిల్ జోర్డాన్‌ల ఘర్షణలు

న్యూయార్కు, మార్చి 31

ఇజ్రాయిల్, జోర్డాన్ ప్రభుత్వాలు రెండూ ఐ. రా. స. ప్రధాన కార్యదర్శికి, తమ దేశ సరిహద్దులలో జరిగిన ఘర్షణల గురించి ఫిర్యాదు చేశారు. వీటిని భద్రతా సమితి పత్రాలుగా వివిధ దేశాలకు ఐ. రా. స. కార్యదర్శి పంచాడు.

హుసన్ గ్రామంవద్ద జోర్డాన్, ఇజ్రాయిల్ సరిహద్దు సేనలు పరస్పరం కాల్పులు సాగించాయి. ఇజ్రాయిల్ సేనలు సరిహద్దు దాటి వచ్చాయనీ, కాల్పులు సాగించగా అవి [illegible] జోర్డాన్ ఆరోపించుతూంది.

గత 24 గంటలలోను మూడుసార్లు తమ సేనలపై జోర్డాన్ కాల్పులుసాగించిందని ఇజ్రాయిల్ ప్రభుత్వ ప్రతినిధి ఒకరు ఇంతకు పూర్వం తెలియజేశారు. అయితే ఎవరూ గాయపడలేదట.

ఇజ్రాయిల్ – జోర్డాన్ సరిహద్దు ఘర్షణల సమస్య గూర్చి విచారించడానికి భద్రతా సమితిని సమావేశపరచాలని అమెరికా, ఫ్రాన్సులకు బ్రిటన్ సూచించిందట.

డీన్ బీన్ ఫూ వశీకరణకు వియత్‌మిన్ సేనల విజృంభణ

హనోయ్, మార్చి 31

ఉత్తర ఇండో-చైనాలోని డీన్ బీన్ ఫూ దుర్గంపై వియత్‌మిన్ సేనలు కొత్త దాడిని ప్రారంభించాయని నేడు ఫ్రెంచి సైన్యాధికారులు ప్రకటించారు. గత పదిహేను రోజులనుండి ఈ దాడి జరుగుతుందని ఫ్రెంచివారు అనుకుంటున్నారు.

చుట్టు ముట్టడింపబడిన డీన్ బీన్ ఫూ నగరంలో ఫ్రెంచి సేనలు 12 వేలు మాత్రమే ఉన్నాయట. దాడి చేస్తున్న వియత్‌మిన్ సేనలు 40 వేల వరకూ ఉన్నాయట. ఇపుడు జరుగుతున్న యుద్ధం గత ఏడేండ్లలోనూ జరగలేదని అంటున్నారు.

గత 5 మాసాలుగా తాము చుట్టుముట్టిన డీన్ బీన్ ఫూను వశపరచుకొనేందుకై మానవ బలాన్ని సముద్రతరంగాలలా ఉపయోగిస్తున్నారని అభిజ్ఞులు అంటున్నారు.

ఫ్రెంచి విమానాలు ఈ దాడిని బాంబులతోను, నాపాం మంటబాంబులతోను వియత్‌మిన్ సేనలను ఎదుర్కొంటున్నాయి. చేతిలో వున్న ఫ్రెంచి విమానాలన్నింటినీ ఈ యుద్ధంలో ఉపయోగించారు.

వియత్‌మిన్ సేనలు డీన్ బీన్ ఫూ దుర్గానికి తూర్పుగా చొచ్చుకు వచ్చాయి. కాని, వారిని త్రిప్పివేశామని, 1500 మందిని నష్టపెట్టామని ఫ్రెంచి అధికారులు చెప్పుతున్నారు. ఇందులో 500 మంది చనిపోయారట కూడా.

ఈలోగా వియత్‌మిన్ సేనలు ఎర్రనదీ మైదానంలో ఫ్రెంచి రవాణా మార్గాలను భగ్నం చేయడానికి ప్రయత్నించుతున్నాయి. ఇండోచైనా మధ్యభాగంలో దియోమాగ్ అనే పర్వత స్థావరాన్ని వియత్‌మిన్ సేనలు వశపరచుకొన్నాయి.

ఫ్రెంచిసేనలు ఆరుసార్లు డీన్ బీన్ ఫూలో తిరుగుదాడిచేసి తాము వదులుకున్న కొంత భూభాగాన్ని వశపరచుకొన్నారట.

ఇంకా పరిస్థితి తమ అదుపులుంచి తప్పిపోలేదని ఫ్రెంచివారంటున్నారు.

మొదట వియత్‌మిన్ సేనలు మందు ప్రేలుడు సామగ్రిఉన్న వాసపు బొంగులతో తీగె కంచెలను ధ్వంసం చేయ ప్రయత్నించాయి. కాని ఫ్రెంచి మెషిన్‌గన్‌లు ఆ ప్రయత్నాలను విఫలం చేశాయనీ తర్వాత వియత్‌మిన్ కాల్బలాలు దాడి చేశాయనీ అంటున్నారు.

ఈ యుద్ధంలో ఒక స్థావరం ఆరుసార్లు చేతులు మారిందట. కొన్నిచోట్ల ఇరుపక్షాలకు బాహాబాహి యుద్ధం జరిగింది.

నేర స్వభావ జాతుల సవరణ బిల్లు

పోలీసుల చేతులో బ్రహ్మాస్త్రమని హైద్రాబాద్ శాసనసభలో ఖండనలు

[విశాలాంధ్ర విలేఖరి]

హైద్రాబాద్, ఏప్రిల్ 1

హైద్రాబాద్, శాసనసభలో మంత్రివర్గం ప్రవేశపెట్టిన నేరస్వభావజాతుల సవరణ బిల్లు, ముఖ్యంగా అందులోని 110 వ సెక్షన్, పోలీసులచేతులో బ్రహ్మాస్త్రమని పలువురు ప్రతిపక్ష సభ్యులు విమర్శించారు.

నేడు ప్రశ్నోత్తరాల అనంతరం హైద్రాబాద్ శాసనసభలో రివెన్యూ మంత్రి శ్రీ గంగారెడ్డిగారి హసాన్ కంట్రోలు బిల్లు, భూమి స్వాధీనపు సవరణ బిల్లు ప్రవేశపెట్టబడ్డాయి.

శ్రీ సి. హెచ్. వెంకట్రామారావుగారు కొన్ని పత్రికల ఏజన్సీలు తమ ఉపన్యాసాలను తొక్కిపెడుతున్నాయనీ, ఇది శాసనసభ్యుల హక్కులను త్రోసిపుచ్చడమే గనుక దీనిని ప్రివిలేజస్ కమిటీ విచారించాలని కోరారు. ఎ. ఎన్. ఎస్., పి. టి. ఐ. సంస్థలు ఈవిధంగావ్యవహరించాయని పేర్కొన్నారు (వీటికి హైద్రాబాద్ ప్రభుత్వం ఏటా విరాళాలు ముట్టజెపుతోంది).

దీనిని వ్యతిరేకించినవారు సభలో లేరు. అందుచేత సమర్థించేవారెందరున్నారని అడగనక్కర్లేదని చెప్పి స్పీకరు ఆ పిటీషనును ప్రివిలేజస్ కమిటీకి పంపారు.

తెలుగు తర్జుమా అవసరం

తర్వాత శ్రీ కె. ఎల్. నరసింహారావు (ఫ్రంట్) గారు బిల్లులకు తెలుగు తర్జుమాలు లేనిదే సవరణల నివ్వడం సాధ్యంకాదన్నారు.

తర్జుమా తయారు కాలేదని శ్రీ విద్యాలంకార్ అన్నారు.

శ్రీ బి. డి. దేశముఖ్ (ఫ్రంట్) మాతృభాషలలో బిల్లులు ఇవ్వాలని డిమాండు చేశారు.

సాధ్యమైనంతవరకు ఇస్తున్నామనీ, పార్టీ నాయకులు తమ పార్టీ వారికి తెలియబరచి సవరణలు తెచ్చేటందుకు ప్రయత్నించాలనీ మంత్రి సమాధానం ఇచ్చారు.

శ్రీ వెండెం వాసుదేవ్ గారు కూడ అనువాదం కావాలన్నారు.

శ్రీ గోపిడి గంగారెడ్డి: "అనేక నెలలనుంచి అనువాదాలడుగుతున్నాం. కళ్ళు మూసుకొని మేము అన్ని బిల్లులకు ఆమోదం ఇవ్వవలసి వస్తూంది. మా నియోజకవర్గాల ప్రజలకు మేమేం చెప్పుకొనేది?"

శ్రీ బి. డి. దేశముఖ్: రెండు మూడు రోజులలో మూడు భాషలలోకీ అనువదింపజేసి ఇవ్వాలి.

అనువాదాలకు అనుకూలంగా వుండేందుకై ఆరవ తేదీన బిల్లులు చర్చకు తీసుకోవాలని స్పీకరు చెప్పారు.

శ్రీ ఎక్బోటే: ఉర్దూ చాలమందికి తెలుసు గనక ఉర్దూభాషలో ఇవ్వడానికి అంగీకరించండి.

శ్రీ బి. డి. దేశముఖ్: కనీసం తెలుగు, ఉర్దూలలో నయినా ఇవ్వాలి.

చివరకుపైబిల్లులను తెలుగు, మరాఠీ, కన్నడ భాషలలో అనువదింపచేసి 5 వ తేదీన సభ్యులకివ్వడానికి నిర్ణయించబడింది.

మంత్రుల జీత భత్యాల సవరణ బిల్లు

తర్వాత మంత్రుల జీతాల, భత్యాల సవరణ బిల్లును శ్రీ విద్యాలంకార్ (ఆర్థికమంత్రి) ప్రవేశపెట్టారు. ఇది ఉపమంత్రుల జీతాలను, భత్యాలను నిర్ణయించుతూంది. ఆర్డినెన్సుద్వారా నిర్ణయించబడిన జీతాలను, భత్యాలను చట్టబద్ధం చేయడానికై ఈ బిల్లు వుద్దేశించబడిందని మంత్రి చెప్పారు.

బిల్లుపేరు "అసెంబ్లీ సభ్యులజీతాల, అలవెన్సుల బిల్లు" – అని వుండటంచేత ప్రతిపక్షం అటువంటి బిల్లురానేలేదను అభిప్రాయంతో సవరణల నివ్వలేదు. ఫలితంగా చర్చ లేకుండానే బిల్లు ముమ్మారు ప్రతిపాదింపబడి, చట్టం చేయబడింది.

ప్రభుత్వోద్యోగుల క్రమశిక్షణ సమస్య

తర్వాత పబ్లిక్ సర్వెంట్సు (ఎంక్వయిరీ ట్రిబ్యునల్) సవరణ బిల్లును శ్రీ బిందూ (హోంమంత్రి) సభలో ప్రవేశపెట్టారు. ప్రభుత్వోద్యోగుల క్రమశిక్షణ సమస్యపై వచ్చిన తగాదాలను విచారించిన ట్రిబ్యునలు తీర్పు ప్రభుత్వానికి సలహా మాత్రంగానే వుండాలని, ప్రభుత్వం దానిని శిరసావహించవలసిన పనిలేదనీ మంత్రి శ్రీ బిందూవివరించారు. ఇకముందు అటువంటి సమస్యల [illegible] పబ్లిక్ సర్వీస్ కమిషన్‌వారితో ప్రభుత్వం సలహా చెయ్యడానికి వీలుగా ఈసవరణ తెస్తున్నామని చెప్పారు.

పబ్లిక్ సర్వీస్ కమిషన్ సలహాలను తీసుకొనేటందుకు వీలుగా తెస్తున్న ఈ సవరణబిల్లును ఫ్రంటు నాయకులు శ్రీ బి. డి. దేశముఖ్, కె. వెంకట రామారావుగార్లు అభినందించారు.

ఈ బిల్లుకు రిట్రాస్పెక్టివు ఎఫెక్టు (ప్యాసు కావడానికి ముందునుంచీ అమలు) వుండేటట్లు తేవాలని శ్రీ బి. డి. దేశముఖు సూచన తెచ్చారు. 1952 మార్చి 6 వ తేదీనుంచి వచ్చిన కేసులకివి వర్తింపచాలని ఆయన సూచన తెచ్చారు.

శ్రీ బిందూ ఇలా సమాధానం యిచ్చారు:

"వెనకటినుంచీ వర్తింపచేయాలంటే కొన్ని కేసులున్నాయి. ఆ తేదీనుంచి ఇప్పటికి 28 మందిని విచారించి డిస్మిస్ చేయడం జరిగిపోయింది. ఈ సవరణ నంగీకరిస్తే లంచగొండులుగా నిరూపించబడినవారందరినీ మరల ఉద్యోగాలలోకి తెచ్చి, జీతాలిచ్చి, పబ్లిక్ సర్వీస్ కమిషన్ సలహా తర్వాత వారిని మళ్ళీ బయటకు పంపాలి. ఇది ఏవిధంగానూ సముచితంకాదు."

తర్వాత చర్చ లేకుండానే బిల్లు చట్టంగా చేయబడింది.

నేర స్వభావం గలవారి బిల్లు

తర్వాత నేర స్వభావంగల వారి బిల్లును చర్చకు తెచ్చారు.

ఈ బిల్లు గతంలోనే శాసనసభ ముందు చర్చకు వచ్చి సెలక్టు కమిటీకి పంపబడింది. ఆ కమిటీ సూచనలననుసరించి, సవరించబడి, నేడు శాసనసభ ముందు పెట్టబడింది.

దీని ప్రకారం ఎవరయినా సరే 110 సెక్షను క్రింద 12 నెలలు శిక్షించబడితే చాలు, నేరస్వభావంగలవానిగా నిశ్చయించి అతనిరాకపోకలపై ప్రభుత్వం నిషేధాల నుంచవచ్చును.

శ్రీ కె. అనంతరెడ్డి (యు. పి. పి.): బిల్లుకుగాని సెలక్టు కమిటీ రిపోర్టుకుగాని అనువాదాలు ఇవ్వలేదు.

శ్రీ గోపిడి గంగారెడ్డి: కళ్ళు మూసుకొని దీన్ని ఆమోదించలేము.

శ్రీ కె. ఎల్. నరసింహారావు: గతంలో ప్రశ్నించినప్పుడు సెలక్టు కమిటీ రిపోర్టుతోపాటు బిల్లు అనువాదాల నిస్తామన్నారు.

స్పీకరు: అనువాదానికై పట్టుపడితే బిల్లు ఈ సమావేశంలో చర్చకురావడం సాధ్యంకాదు.

శ్రీ కె. ఎల్. నరసింహారావు: ఇదివరకు కౌలుదారీ బిల్లు సెలక్టు కమిటీ రిపోర్టుకిచ్చినట్లే అనువాదం ఇస్తారని భావిస్తున్నాం.

స్పీకరు: కొన్ని సవరణలు కూడా దీనికి వచ్చాయి.

శ్రీ కె. ఎల్. నరసింహారావు: అవి ఇంగ్లీషు వచ్చిన వారిచ్చారు.

శ్రీ గంగారెడ్డి: అనువాదాలు కావలసింది మాకే కాదు. ప్రభుత్వపక్ష సభ్యులలోకూడ మావంటివారున్నారు.

ప్రథమ పర్యాయం బిల్లును చర్చకు తెచ్చినప్పుడు శ్రీ అన్నారావు గవానే (యు. పి. పి.) ఈ విధంగా ఉపన్యసించారు:

"110 సెక్షనుక్రింద మూడుమార్లు జామీను నివ్వవలసి వచ్చిన వానిని మాత్రమే నేరస్వభావం కలవాడుగా భావించబడాలి."

శ్రీ ఎ. లక్ష్మీనరసింహారెడ్డిగారిలా అన్నారు:

"కేవలం 110 సెక్షన్‌క్రింద నేరారోపణ చేయబడేవానిని నేరస్వభావం గలవానిగా నిర్ణయించే బిల్లు చాల అన్యాయం. ఇది పోలీసుల చేతిలో బ్రహ్మాస్త్రం వంటిది.

"కోర్టు నేరస్వభావం కలవాడుగా నిర్ణయం చేసినప్పుడే వాని కార్యకలాపాలను నిషేధంలో వుంచవచ్చునని సవరణను బిల్లుకు తేవాలి."

శ్రీ కె. అనంతరెడ్డి (యు. పి. పి.): "నేరస్వభావం కలవాడంటే ఎటువంటివాడో మొదట బిల్లులో లేదు. సెలక్టుకమిటీ దానిని కొత్తగా చేర్చింది. బిల్లుకు పునాది 110 సెక్షను. దాని క్రింద కేసులుపెట్టే పని పోలీసులది. అది వుండకూడదు. అయిదేళ్ళలో మూడుమార్లు ఆ సెక్షన్ క్రింద జామీను నివ్వవలసి వచ్చిన వానిని నేరస్వభావం గలవానిగా నిర్ణయించాలని నా కోరిక. దానితో బిల్లు స్వభావం మారిపోతుంది. అప్పుడయినా మాజిస్ట్రేటు నోటీసు నిచ్చి, విచారించి, నేరస్వభావం గలవాడుగా తేలినట్లయితేనే అతనిపై నిఘా, నిషేధాలు వుంచాలి."

శ్రీ కె. వెంకట్రామారావుగారు (ఫ్రంట్): "సెలక్టు కమిటీకి "వెళ్ళాక" పేరుమారిందేగాని స్వభావం మారలేదు. పోలీసు లెవరినైనా పట్టుకోదలిస్తే, వానికి నేరం ఏదీకనబడక పోతే, నేరనిరోధం పేరుతో ఈ సెక్షను క్రింద ఎవరినైనా అరెస్టుచేసి కేసుపెట్టడం జరుగుతుంది. నేరంలేనివారిని నేరస్థులుగా [illegible]డానికుపయోగిస్తున్న సెక్షనును ఈ బిల్లుకు పునాదిగా చేయడం సిగ్గుచేటు.

"జనగామలో ఒక గ్రామంలో రెండుపార్టీలున్నాయి. ఒక పార్టీవారు పోలీసులనుకట్టుకొన్నారు. రెండోపార్టీ వారిపై 110 వ సెక్షనుక్రింద కేసుపెట్టారు. రాజకీయ కార్యకర్తల్ని ఈ సెక్షను క్రింద కేసుల్లో యిరికించడం జరుగుతుంది. ఈవిషయాన్ని గురించి చెప్పలేక మా ప్రాణం విసిగిపోతూంది. నేరస్వభావం నిజంగాగలవారిని బాగుచేయడానికి ఇది ఏమాత్రం తోడ్పడదు. ఇది బ్రిటిషు వాళ్ల దృక్పథాన్ని ప్రకటిస్తూంది. పోలీసు వాళ్ళకి అసాధారణ అధికారాధికారాల నిస్తూంది."

శ్రీ కె. యల్. నరసింహారావు (ఫ్రంట్):

"స్వాతంత్ర్యం వచ్చాక రద్దయిన నేరస్థుల చట్టాన్ని ఈ పేరున పునరుద్ధరిస్తున్నామనీ, అటువంటివారి సంస్కరణంచేటందుకే దీనిని తెస్తున్నామనీ చెప్తున్నారు. కాని 110 సెక్షను క్రింద పెద్ద ఎత్తున ప్రజల్ని పీడించేటందుకై అధికారాలకోసం ఈ బిల్లు తెస్తున్నారు. ఈ సెక్షను క్రింద ఈ ప్రభుత్వం హయాంలో ఎవరిపై కేసులు పెడుతున్నారో ఎరుగుదుం. పోలీసులకు ఎవరిమీదైనా కోపంవస్తే ఈ సెక్షను క్రింద కేసులు పెడుతున్నారు. పోలీసు చర్యఅనంతరం ప్రజాసంస్థల కార్యకర్తల మీద ఈ సెక్షనును ప్రయోగించడం అలవాటయింది. చివరకు ఈ సభలోని శాసనసభ్యుల మీద కూడా ఈ సెక్షను క్రింద కేసులుపెట్టి జామీనులు కూడా పుచ్చుకొన్నారు దీనిసాయంతోకాంగ్రెసును వ్యతిరేకించిన వారందరినీ నొక్కెయ్యాలని చూస్తున్నారు. ఈ బిల్లుక్రింద పెట్టిన నిర్బంధాల్ని అతిక్రమించాడనే పేరుతో యావజ్జీవ శిక్ష విధించడానికి [illegible] ఈ బిల్లులో అవకాశం కలిగించబడుతూంది. ఇటువంటి దారుణం ఏచట్టంలోనూ లేదు.

"ఈ 110వ సెక్షను మన హోంశాఖ ముద్దుబిడ్డ. నేర స్వభావం నిర్ణయించడంలో బిల్లులో చిత్రమయిన వాదనలున్నాయి. ఎవరయినా ఈ సెక్షను క్రింద జామీను నిచ్చినంత కాలవ్యవధిని అతడు జైలు శిక్షననుభవించి నట్లుగానే భావిస్తారట. అటువంటి కేసుల్ని నిరూపించవలసిన బాధ్యత ప్రభుత్వానికి లేదట. తాను నేరంచేయలేదని నిరూపించుకోవలసిన బాధ్యత ముద్దాయిదేనట. ఈ చట్టంక్రింద ఒక ప్రదేశంలో ఉండవలసిందని ఆజ్ఞాపించబడిన వ్యక్తికి ఇతర గ్రామాలలో ఎవరయినా [illegible] నేరం చేసినట్లేనట. ఒక వ్యక్తి నేర స్వభావంగల వాడుగా శిక్షింపబడినట్లు ప్రపంచానికి తెలియడం ఎట్లా?"

శ్రీ ఎల్. ఎన్. ప్రాఫ్ (కాంగ్రెసు) 110 వ సెక్షనును ప్రశంసిస్తూ ఉపన్యసించారు.

కార్మిక ప్రయోజనాలపట్ల ప్రభుత్వ ఉపేక్షాభావం

కార్మిక మంత్రిత్వ పద్దుపై మాట్లాడుతూ ప్రజాసభలో శ్రీ తుషార్ చటర్జీ విమర్శ

న్యూఢిల్లీ, మార్చి 31

కార్మికులకు కనీస జీవన సౌకర్యాలను ప్రభుత్వం కలుగజేయకపోగా కనీస వేతనాలకోసం, పనులనుండి తొలగింపుకు వ్యతిరేకంగా జరుగుతున్న కార్మికపోరాటాల్లో జోక్యం కల్పించుకొని యజమానుల కొమ్ముకాస్తున్నదని నేడు ప్రజాసభలో కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ తుషార్ చటర్జీ విమర్శించారు.

ఈ వేళ ప్రజాసభలో కార్మిక మంత్రిత్వశాఖ పద్దుపై చర్చ జరిగింది. ఈ యేడాది కార్మికశాఖకు బడ్జెట్‌లో 4 కోట్ల 67 లక్షల రూపాల మొత్తం కేటాయించ బడింది.

చర్చను శ్రీ తుషార చటర్జీ (కమ్యూనిస్టు) ప్రారంభిస్తూ కార్మికులు నేడున్న దుర్భర పరిస్థితులను సహించలేక పోరాటాలను ప్రారంభించవలసి వస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం వారి కష్టాలను తొలగించేందుకు ఏమాత్రం చర్యలను తీసుకోవడంలేదని ఆయన విమర్శించారు. జీతాలు చాలక తెగించి సమ్మెలను జరిపే కార్మికులపై నిర్బంధ విధానం అమలుజరిపి ప్రభుత్వం అణచటానికి యత్నించుచున్నదన్నారు. పనులనుండి తొలగించడంలో యజమానులకు ప్రభుత్వం ప్రత్యక్షంగా సహాయపడటాన్ని ఆయన ఉదహరించారు. యజమానులపక్షం వహించి కార్మికులను అణచడానికి ప్రభుత్వం కాన్పూర్, బొంబాయి, బర్న్‌పూర్ తదితర ప్రదేశాల్లో సాగించిన నిర్బంధ విధానాన్ని శ్రీ చటర్జీ వివరించారు.

శ్రీ కె. పి. త్రిపాఠీ (జాతీయ ట్రేడుయూనియన్ ప్రధాన కార్యదర్శి) మాట్లాడుతూ కార్మికవర్గంపట్ల ప్రభుత్వ వైఖరి ప్రశంసనీయంగానే ఉన్నదన్నారు. ప్రభుత్వం అనుసరించే మధ్యవర్తి విధానం కార్మికులకు అనుకూలంగానే ఉన్నదన్నారు. అయితే అది అమలు జరిపించడంలో ప్రభుత్వం తగిన శ్రద్ధతీసుకోవడం లేదన్నారు.

వ్యవసాయ కూలీలలో నిరుద్యోగ తీవ్రత

శ్రీ బెజవాడ రామచంద్రారెడ్డి (స్వతంత్ర) మాట్లాడుతూ వ్యవసాయ కూలీలలోనిరుద్యోగసమస్య తీవ్రతరంగా ఉన్నదనీ, నిరుద్యోగ నిర్మూలనకు కొన్ని సత్వరచర్యలను తీసుకోవాలని కోరారు.

శ్రీ గణేష్‌లాల్ చౌదరి (కాంగ్రెసు యు. పి) దేశంలోని వ్యవసాయ కూలీల పరిస్థితులను గురించి విచారించడానికి ఒక కమిషన్ నియమించాలని సూచించారు.

శ్రీ యస్. కేశవ అయ్యంగార్ (కాంగ్రెసు – మైసూరు) ప్రభుత్వం ఒక సమగ్రమైన కార్మిక శాసనాన్ని పార్లమెంటులో సత్వరంగా ప్రవేశపెట్టేందుకు పూనుకోవాలన్నారు.

శ్రీ బి. యస్. మూర్తి (ఆంధ్ర) ప్రభుత్వ కార్మిక విధానం అస్పష్టంగా ఉన్నదని విమర్శించారు.

ఆర్. వెంకట్రామన్ (కాంగ్రెసు–మద్రాసు) కార్మిక శాసనం ఈ సారి పార్లమెంటు సమావేశంలోకూడ ప్రవేశపెట్టబడక పోవచ్చుననే భయాన్ని వెలిబుచ్చారు. త్వరగా శాసనం ప్రవేశపెట్టవలసిందిగా ఆయన కార్మికశాఖ మంత్రిని అభ్యర్థించారు.

చర్చకు కార్మికశాఖామంత్రి శ్రీ వి. వి. గిరి సమాధానం చెప్పుతూ కార్మిక శాసనం తయారుచేయడం పూర్తిఅయినదని, దానిని మంత్రివర్గ ఆమోదానికి పెట్టడమే తరువాయిఅని తెలియజేశారు. త్వరలో బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టగలననే ఆశాభావాన్ని ఆయనవెలిబుచ్చారు.

అన్నిపక్షాల సహకారాన్ని పొందగ[illegible] ఆశయమని సభ్యుల విమర్శలకు సమాధానంగా ఆయన చెప్పారు.

ఆ తరువాత ప్రతిపక్ష సభ్యులు ప్రతిపాదించిన కోత తీర్మానాలు నిరాకరింపబడి పద్దు ఆమోదింపబడింది.

కొత్తగూడెం బొగ్గు గని 'బర్లిపిట్' మూసివేత?

///

లాభాలుకాపాడుకోడానికి యజమానులకుట్ర

[విశాలాంధ్ర విలేఖరి]

కొత్తగూడెం, ఏప్రిల్ 1

కార్మికులకు బోనసు పంచిపెట్టవలసివస్తుందనే దురుద్దేశ్యంతోను, తమ లాభాలను రక్షించుకొనే ఉద్దేశ్యంతోను కొత్తగూడెం బొగ్గు గనులలో ఉత్పత్తిని యజమానులు కుంటుపరుస్తున్నారు. బర్లిపిట్ అనే పెద్ద గనిని మూసివేయడానికి తయారవుతున్నారు.

కొత్తగూడెం గనులలో అన్నిటికన్నా పెద్దది బర్లిపిట్. ఇందులో 2700 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇది దాదాపు ఇరవై సంవత్సరాల నుండి నడుస్తున్నది. కాలరీలో కల్లా ఎక్కువ బొగ్గు ఉత్పత్తి జరిగేది ఈ గనిలోనే. ఇంకా పది పదిహేను సంవత్సరాలు ఇది నడుస్తుంది. అయితే ఈ లాంటి గనికి ఉత్పత్తి ఖర్చు పెరుగుతున్నదనే కారణం చూపుతూ క్రమేణా కార్మికుల సంఖ్య తగ్గించి తక్కువమంది కార్మికులతో ఎక్కువ ఉత్పత్తి చేయించి ఆ విధంగా ఉత్పత్తి ఖర్చులను తగ్గించుకుందామని యజమానులు యత్నిస్తున్నారు. కొద్ది రోజుల్లోనే 400 మంది కార్మికులను గనిపనినుండి ఆపి "బదిలీ కార్మికులుగా" (లేబర్ పూల్) వుంచుతారని తెలుస్తున్నది. ఇప్పటికే 50 మందిని ఈవిధంగా పనినుండి మళ్ళించారు.

'లేబర్ పూల్‌కు' పంపిన వారికి తగిన పనులను యివ్వాలనే షరతుఉంది. కాని ప్రస్తుతం మానేజిమెంటు ఆ షరతు నుల్లంఘించి వారికి బరువైన పనులు యిచ్చారు. దీనిని కార్మికులు తీవ్రంగా వ్యతిరేకించుచున్నారు. తాము ఇంతవరకూ చేసిన పనుల వంటివే వారు కోరుతున్నారు. కంపెనీ యజమానులతో యూనియన్ సంప్రదింపులు జరుపుతున్నది. ఈవిషయంలో కంపెనీవారు ఇంతవరకు అమలులో యున్న పద్ధతులను కూడ వ్యతిరేకించుచున్నారు.

ఉత్పత్తి ఖర్చు ఎందుకు పెరుగుతున్నది?

కంపెనీ చూపుతున్నట్లుగా కార్మికుల లెక్కువమంది యుండటంవల్ల ఖర్చు పెరగటంలేదు. వాస్తవానికి లోగడకంటే ఇప్పుడు కార్మికులసంఖ్య తగ్గింది. కాని సూపర్ వైజర్ల సంఖ్య పెరిగింది. అంటే పెద్దజీతగాళ్ళసంఖ్య పెరిగింది. పనినడిచే ప్రదేశాలసంఖ్య తగ్గింది. కొన్ని ప్రదేశాలు నీటితో నిండిపోయాయి. వీటిని ఖాళీచేయడానికి కంపెనీవారు తగిన శ్రద్ధ చూపడంలేదు. ఇందుకు మూల కారణాలు కనిపెట్టి తగిన చర్యలు తీసుకుంటే పనులు త్వరగా నడుస్తాయి. అనుభవ శూన్యులయిన ఆఫీసర్లే ఇందుకు కారకులు.

సమ్మె ముగిసిన నాటినుండి కంపెనీ యజమానులు ఉత్పత్తిని పెంచటంలో పూర్తి నిర్లక్ష్యత ప్రదర్శించారు. యూనియన్‌తో చేసుకున్న ఒడంబడిక ప్రకారం 1953 సంవత్సరం ఆఖరుకు నిర్ణీతమైన ఉత్పత్తిజరిగితే 8½% ప్రత్యేకబోనసు యివ్వాల్సియుంది. ఆ ప్రత్యేకబోనసు యివ్వకుండా ఎగవేయటానికై బుద్ధిపూర్వకంగా కంపెనీ యజమానులు ఉత్పత్తిని పడగొట్టారు. పనికి అవాంతరాలు ఏర్పడితే చాలా ఆలస్యంగా మరమ్మతులు జరిపారు. చెడిపోయిన ఇంజన్లను స్థానిక వర్కుషాపులో మరమ్మతు చేసేదానికి బదులు కొత్తమిషన్ల రాకకోసం ఎదురుచూస్తూ చెడిపోయిన వాటిని అలాగే వుంచారు. ఈలాగే అనేక కారణాలవల్ల ఉత్పత్తి దెబ్బతినిపోయింది.

కార్మిక యూనియన్ ఈ విషయాలపై వివరమైన మెమొరాండమును కంపెనీ యజమానులకు, గవర్నమెంటుకు సమర్పించింది. కాని ఎవరూ పట్టించుకోలేదు. యిప్పుడుమాత్రం ఖర్చు తగ్గించే నెపంతో కార్మికులను తగ్గించటానికి దుష్టప్రయత్నం చేస్తున్నారు.

గమనించ తగ్గ విషయమేమంటే నిరుడు 14 లక్షల రూపాయలు జేబులో వేసుకున్న కంపెనీవారు ఈ ఏడు అమాంతం నష్టం వస్తున్నదనే రాగం ఆలాపన చేస్తున్నారు. కాని యదార్థ సత్యం అందరికీ తెలుసు.

కార్మిక నాయకుని ప్రకటన

"దేశ పరిశ్రమాభివృద్ధికిఎంతోగానో అవసరమైన ఈ బొగ్గు గనిని మూసివేయకుండా చూడవలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. ప్రభుత్వం ఇందుగురించి తగు చర్యతీసుకోవాలి" అని సింగరేణి గని కార్మిక సంఘ నాయకులు శ్రీ పి. సత్యనారాయణగారు ఒక విజ్ఞప్తి చేశారు.

లేఖలు

ఫ్రెంచి యానాం విషయం

మహాశయా !

ఫ్రెంచి ఇండియాలోని 17 మునిసిపాలిటీలలోను 14 మునిసిపాలిటీలు విలీనము గురించి తీర్మానించినవట. 3 మాత్రం యింకా తీర్మానించలేదు. ఈ మూడింటిలో యానాం ఒకటి.

యానాం మన ఆంధ్రదేశంలోని–గోదావరీ ముఖద్వారంలో నున్నది. భూభాగంగానే కాకుండా సముద్ర దృష్ట్యాకూడా కీలకస్థానం ఇచ్చటి ప్రజా జీవితానికీ, ప్రక్క ప్రాంతీయుల జీవితానికీ అనేక విషయాలలో అవినాభావసంబంధం.

పుదుచ్చేరిలో బ్రహ్మాండమైన ప్రజా ఉద్యమం బయలు దేరింది. కాని యానాంలో యెట్టి చైతన్యమూ అగుపడుటలేదు. దీన్నిబట్టి ప్రక్కనున్న ఆంధ్రులంతా తమ శృంఖలములను త్రెంచివేసుకొన్న పిమ్మటగూడా యిచ్చటి మనఆంధ్ర సోదరులు మువ్వన్నెల ఫ్రెంచి జెండానే వరించి, ఫ్రెంచి దాస్యంతోనే తృప్తిపడి యుండాలనే అభిప్రాయంలో నున్నారా లేక నూతన ఆంధ్ర ప్రజా జీవితంలో తాముకూడా భాగస్వాములు కాదలచు కొంటారా? ఈ విషయాన్ని యానాం నాయకులు వెంటనే నిశ్చయించుకోవాలి.

గుమ్మిడిదల సుబ్బారావు
అమలాపురం, 29–3–54

* * *

తిరువాన్కూర్–కొచ్చిన్ మంత్రులు తమ జీతాలలో ఐచ్ఛికంగా 200 రూపాయలు కోతపెట్టుకున్నారు.

తెలంగాణా గ్రామాలపై కాంగ్రెసుగూండాల దాడి

ప్రభుత్వం వెంటనే అరికట్టాలని కమ్యూనిస్టుకమిటీ డిమాండ్

హైదరాబాద్, మార్చి 31

తెలంగాణా గ్రామాలలో కమ్యూనిస్టు, రైతు సంఘ కార్యకర్తలపై కాంగ్రెసు గుండాలు, పోలీసులు వరుసనే ఒక ప్లాను ప్రకారం సాగిస్తున్న దౌర్జన్యాలను, అక్రమాలను వివరిస్తూ తెలంగాణా కమ్యూనిస్టు కమిటీ కార్యాలయంనుండి యీ దిగువ వివరాలు తెలియ జేస్తున్నారు.

కరీం నగర్ తాలూకా రైతుసంఘ యాజమాన్యాన చేగుర్తి గ్రామంలో మార్చి 28 న జరుగుతున్న బహిరంగ సభపై తాలూకా కాంగ్రెసు నాయకులు, గుండాలు దాడిచేసి జిల్లా రైతు సంఘ కార్యదర్శి శ్రీ పి. చొక్కారావు, శ్రీ లక్ష్మారెడ్డి తదితరులను లాటీలతో బాది సభ జరగకుండా గల్లంతు చేసారు. వేదికపై అమర్చబడిన "మైక్" సెట్టు, బల్లలు, కుర్చీలు ముక్కలు-ముక్కలు చేసారు. అంతటితో ఆగక అనేక ఇండ్లపై దాడిచేసి గ్రామంలో స్వైరవిహారం చేసారు.

మార్చి 7 వ తేదీన వరంగల్ జిల్లా పర్కాలతాలూకా అమ్మపేట గ్రామంలో రైతుసంఘ యాజమాన్యాన జరుగుతున్న ఊరేగింపుపై కాంగ్రెసు వాదులు, రౌడీలు దాడిచేసి ప్రజలను దెబ్బలు కొట్టి రైతుసంఘం జండాను తెగుల బెట్టారు.

పర్కాల తాలూకాలో కడ్వటంచ గ్రామంలో జాతర జరుగుతున్న సందర్భంలో మార్చి 19 వ తేదీన రైతు సంఘం పక్షాన పెద్ద ఊరేగింపు జరుగుతూంటే దానిపై కాంగ్రెసు వాదులు పోలీసుల సమక్షంలో, దాడిచేసి రైతు సంఘ కార్యకర్తలను, ప్రజలను విపరీతంగా చితుకకొట్టారు.

నల్లగొండ జిల్లా, హుజూరు నగరు తాలూకా సోమప్పగ్రామంలో తిరునాళ (జాతర) సందర్భంలో మార్చి 16 వ తేదీన కాంగ్రెసువాదులు, పోలీసులు కలిసి తాలూకా రైతుసంఘ ఉపాధ్యక్షుడు, తాలూకా కమ్యూనిస్టుపార్టీ నాయకుడు అయిన శ్రీ అనుమాల లింగయ్యగారు ఒక దుకాణంలో కూర్చునివుంటే బయటికిలాగి విపరీతంగా బాదారు.

మార్చి 21వ తేదీన హుజూరునగరు తాలూకా పానుగోడు గ్రామంలో కాంగ్రెసువారు స్థానిక గ్రంధాలయం పైన, అనుమాల లింగయ్యగారి ఇంటి పైనాదాడిచేశారు. స్థానిక కార్యకర్తలను అనేకమందిని దెబ్బలు కొట్టారు. గ్రంధాలయం బోర్డును ఎత్తుకపోయ్యారు. ఇవి అన్ని జరిపి పోలీసులచే స్థానిక కార్యకర్తల (12) మందిపై కేసులబనాయించి అరెస్టు చేయించారు.

సూర్యాపేట తాలూకాలోని పర్సాయపల్లి గ్రామంలో 'ఫతే మహ్మదు"ను మార్చి 2 వ తేదీ నాడు దెబ్బలుకొట్టినారు. దానికి వ్యతిరేకంగా ప్రజలు వూరేగింపుచేస్తే దౌర్జన్య చర్యలు జరిపారంటూ 10 మందిపై కేసు పెట్టి అరెస్టు చేయించి జైలులో పెట్టారు. గ్రామంలో ప్రాంతీయ అగ్రనాజరు అయిన శ్రీ గంగులును తంతామని బహిరంగంగా ప్రకటిస్తున్నారు.

మేము యింతకు పూర్వం జరిగిన అనేక సంఘటనలను ప్రభుత్వం దృష్టికి తెచ్చినప్పటికీ ప్రభుత్వం వాటిపై బహిరంగ విచారణజరిపించలేదు. దాడులకు బాధ్యులైన కాంగ్రెసు వారిపై పోలీసు అధికారులపై ఎలాంటి చర్య తీసుకోలేదు.

కాంగ్రెసువారు ఈ దౌర్జన్య చర్యలను సాగించడానికిగలకారణంస్పష్టమే. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెసువారు తరచుగా ఓడిపోతూ కమ్యూనిస్టు పార్టీచే బలపర్చబడిన అభ్యర్థులు గెలుచుచున్నారు. చట్టసమ్మతి హక్కులైన వెట్టి చాకిరీ నిషేధం, బేదఖలీల నిషేధం మొదలగు వాటిని అమలు జరుపుకోడానికి ప్రజలుముందుకు వస్తున్నారు. దీనినిచూచి కాంగ్రెసుపార్టీ తమ అధికారాన్ని నిలబెట్టుకోడానికి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో తమ అధికారాన్ని స్థిరపర్చుకోడానికే, ఇప్పటినుండీ ఈ అక్రమాలకు పాల్పడుతున్నారు.

కనుక ప్రభుత్వం వెంటనే కాంగ్రెసు వాదుల, స్థానిక పోలీసు అధికారులచే జరుపబడుతున్న ఈ దౌర్జన్య చర్యలపై బహిరంగ విచారణ జరిపించాలని బాధ్యులైన వారిని శిక్షించాలని తెలంగాణా కమ్యూనిస్టుకమిటీ కోరుతున్నది.

కొత్తపట్నం రాజకీయ పాఠశాల

మే నెల 5 నుండి 15 వరకు

గుంటూరు, మార్చి 28

గుంటూరుజిల్లా కొత్త పట్నంలో మేనెల 5 నుండి 15 వరకు నిర్వహింపబడుతుందనీ, రాజకీయ తరగతులలో మార్కిస్టు ప్రాథమిక పాఠాలు, ఆర్థిక తత్వశాస్త్రాలు, మొదలైనవి బోధింపబడగలవనీ, పాఠశాలకు వచ్చే విద్యార్థి 12 రూ॥ లు చెల్లించవలసి వుంటుందనీ, ఉత్తర ప్రత్యుత్తరాలు జిల్లా విద్యార్థి ఫ్రాక్షన్; గుంటూరు పేరున జరుపవల్సిందిగా కోరుతూ విద్యార్థి కమిటీ ప్రకటిస్తోంది.

విశాఖ హాస్పిటల్ పనివారల సమావేశం

విశాఖపట్టణం, మార్చి 26

ఈ నెల 24 వ తేదీన విశాఖ హాస్పిటల్ ఎంప్లాయీస్ యూనియన్ సాధారణ సమావేశం శ్రీ భద్రమూర్తి అధ్యక్షతను ఇక్కడ జరిగింది. రాష్ట్రసంఘ కార్యదర్శి శ్రీ గురుమూర్తిగారు సభలో ఉపన్యసిస్తూ వివిధ పరిశ్రమలలో పనిచేసే కార్మికులు ఐక్యమై తమ హక్కులను కాపాడుకోవాలని ఉద్ఘాటించారు. భీమవరం నర్సాపురం తాలూకా బస్సు కార్మికులమీద, యజమానులు పోలీసుల అండతో జరుపుతున్న దౌర్జన్యాన్ని, ప్రభుత్వం విధించిన 144 వ సెక్షన్‌ను నిరసిస్తూ సభలో తీర్మానం చేశారు. గుంటూరు మునిసిపల్ కార్మికుల సమ్మె న్యాయమైనదనీ, తొలగించిన కార్మికులను తిరిగిపనిలోకి తీసుకుని అధికారులు సమ్మెను పరిష్కరించాలనీ కోరుతూ పోటీ కార్మికులను తెచ్చి సమ్మెను విచ్ఛిన్నం చేయాలనే అధికారుల ప్రయత్నాలను మరొక తీర్మానంలో సమావేశంవారు నిరసించారు.

శృంగవృక్షం

పశ్చిమ గోదావరిజిల్లాకు శృంగవృక్షం శివారు నందమూరి గర్వ గ్రామంలో శ్రీ కొల్లా వెంకటరత్నం గారి అధ్యక్షతను ఇటీవల బహిరంగసభ జరిగింది. ఉపన్యాసాల అనంతరం నర్సాపురం మోటారు వర్కర్లపై పెట్టిన కేసు ఉపసంహరించుకోవాలనీ, వ్యవసాయ కూలీల కనీస వేతనాలు చట్టం చేయాలనీ కోరుతూ తీర్మానించారు.

ఉపాధ్యాయుల రాజకీయ హక్కులు

ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వాలని గుంటూరుజిల్లా తెనాలితాలూకాసంయుక్తమహాసభలతీర్మానం

కొల్లూరు, మార్చి 30

పౌరులందరికి వలెనే ఉపాధ్యాయులుకూడ రాజకీయ హక్కులు కలిగివుండేట్లు ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వాలని కోరుతూ, తెనాలి తాలూకా ప్రాథమికోపాధ్యాయ మహాసభ, గుంటూరుజిల్లా ప్రాథమికోపాధ్యాయ మహాసభలలో తీర్మానించబడింది.

పై మహాసభలు తెనాలి తాలూకా కొల్లూరు గ్రామంలో మార్చి 27, 28 తేదీలలో ఆంధ్రరాష్ట్ర ప్రాథమికోపాధ్యాయ సంఘం అధ్యక్షులు శ్రీ చెన్నుపాటి లక్ష్మయ్యగారి అధ్యక్షతను జరిగాయి.

జిల్లామహాసభను శ్రీ గోడాలి దామోదరయ్యగారు ప్రారంభిస్తూ, స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు సంవత్సరాలయినప్పటికీ ఉపాధ్యాయుని ఆర్థికపరిస్థితిలో మార్పురాలేదన్నారు. ఆంధ్రలో ప్రజలే అనేక పాఠశాలలు కట్టించి విద్యాభివృద్ధికి తోడ్పడుతున్నప్పటికీ, పేదవారికి విద్య అందుబాటులో లేదన్నారు. జీతాలు, స్పెషల్ ఫీజులు ఎక్కువ అవుతున్నాయని, సిలబస్‌లో మార్పులేక పోయినా పాఠ్యపుస్తకాలను అనవసరంగా మార్చి కొంతమంది ప్రచురణకర్తలకు లాభాలను చేకూరుస్తున్నారని చెప్పారు. ప్రస్తుత విద్యావిధానమును మార్చాలన్నారు. ఉపాధ్యాయునికి సరియగు జీవనభృతి కలిగించి వారి ఆర్థికకష్టోమత తొలంచవలసిందని నుడివారు. ప్రభుత్వం ప్రతిదానికీ డబ్బు లేదని సాకు చెప్పడం సరికాదన్నారు.

ఉపాధ్యాయులను రాజకీయాలకు దూరంగా ఉండమనటం వారి సమస్యలను గురించి ఆలోచించవద్దని చెప్పడమే అవుతుందన్నారు. సామాన్య పౌరునివలెనే ఉపాధ్యాయుడు కూడ తనకిష్టమైన రాజకీయాలను అవలంబించుటకు స్వేచ్ఛ కలిగి ఉండాలన్నారు.

అధ్యక్షోపన్యాసం

తరువాత అధ్యక్షులు శ్రీ చెన్నుపాటి లక్ష్మయ్యగారు ఉపన్యసిస్తూ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక కష్టాలను వివరించారు. ప్రజా సహకారం పొంది, సంఘ శక్తితో ఆందోళన జరిపినచోట్ల ఉపాధ్యాయుల జీతాలు కొద్దిగా పెరిగా యన్నారు. సంఘశక్తి, ప్రజా సహకారం ఎంతైనా అవసరమని నొక్కి చెప్పారు. బెంగాలులోని ఉపాధ్యాయుల సమ్మె, దానివల్ల కలిగిన ఫలితాలను వివరించారు.

[illegible] సభానంతరం ఉపాధ్యాయులు నినాదాలు యిచ్చుకొంటూ ఒక ఊరేగింపు జరిపారు.

[illegible] తేదీరాత్రి ఒక పెద్ద బహిరంగ సభ జరిగింది. ఈసభకు శ్రీ చెన్నుపాటి లక్ష్మయ్యగారు అధ్యక్షత వహించారు.

శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు మహాసభను ప్రారంభిస్తూ, ఉపాధ్యాయులు, బాలురలో ఆత్మాభిమానాన్ని పెంపొందించాలన్నారు. మన సాహిత్యంలో ఉన్న అత్యున్నతమైన కథలను బాలురకు బోధించి వారిని దేశభక్తిగల పౌరులుగా తయారుచేయాలన్నారు.

తరువాత కొల్లూరు బోర్డుహైస్కూలు తెలుగు పండితులు, కవి అయిన శ్రీ కె. సత్యనారాయణచౌదరిగారు మాట్లాడుతూ ఉపాధ్యాయుని అందరూ పొగడువారేకాని, వాని గోడు ఆలకించే వారెవరూ లేరన్నారు. శ్రీ మద్దులూరి రామకృష్ణగారు బాలల సాహిత్యాన్ని గురించి మాట్లాడారు.

తరువాత పార్లమెంటు సభ్యులు శ్రీ కొత్త రఘురామయ్య, శాసన సభ్యులు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగార్లు పంపిన సందేశాలను అధ్యక్షులు చదివారు. అధ్యక్షులు మహాసభలో చేసిన తీర్మానాలను వివరించిన మీదట సభ సమాప్తమయింది.

మహాసభ అనంతరం వైజ్ఞానిక ప్రదర్శనాలు జరిగాయి. కొల్లూరు బాలికలు జంధ్యాలపాపయ్యశాస్త్రిగారురచించిన 'కరుణామయి' అనునాటిక, దోనేపూడి విద్యార్థులు 'ఉపాధ్యాయ' అను నాటిక అమృతలూరు బాలికలు భరతనాట్యం, పెదపాలెం విద్యార్థినులు 'గోపీడాన్సు' ప్రదర్శించారు.

తీర్మానాలు

తాలూకా, జిల్లా మహాసభలలో ఈ క్రింది తీర్మానాలు చేయబడినవి.

ఉపాధ్యాయులపై నిర్బంధవిధానం అమలు జరిపిన పశ్చిమ బెంగాలు ప్రభుత్వ విధానాన్ని ఖండిస్తూ, ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తూ తీర్మానించారు.

'నూతన' ప్రాథమిక విద్యావిధానాన్ని ఉపసంహరించుకోవాలనీ, సస్పెండు చేయబడిన [illegible] పునరుద్ధరించాలనీ, నూతన ప్రాథమిక విద్యావిచారణ కమిటీలో ఉపాధ్యాయులకు ప్రాతినిధ్యము కల్పించాలనీ విజ్ఞప్తి చేశారు.

సెంట్రల్ పేకమీషన్ (కేంద్రవేతన నిర్ణాయకసంఘం సిఫారసు చేసిన) స్కేళ్ళను అమలుపరచాలనీ, ప్రభుత్వం ఇతర పౌరులకు వలెనే ఉపాధ్యాయులకుకూడ రాజకీయహక్కులు గ్యారంటీ చేయాలని, పంచాయితీబోర్డుసభ్యులుగా ఎన్నికైన ఉపాధ్యాయులకు ఉద్యోగ, జీతాలగ్యారంటీ ఉండాలని కోరారు.

పాఠశాలలో యున్న హాజరు కొరతకు ఉపాధ్యాయులే బాధ్యులన్న నియమాన్ని తొలగించాలనీ, శాసనసభలలోనూ, స్థానిక సంస్థలలోనూ ప్రాథమికోపాధ్యాయులకు ప్రాతినిధ్యం కల్పించాలనీ మరికొన్ని తీర్మానాలు చేశారు.

జిల్లా ప్రాథమికోపాధ్యాయ సంఘానికి శ్రీ టి. వి. సుబ్బారావుగారు అధ్యక్షులుగా, శ్రీ కొప్పుల వెంకటేశ్వర్లుగారు ప్రధాన కార్యదర్శిగా నూతన కార్యవర్గం ఎన్నుకోబడింది.

తెనాలి తాలూకా ఉపాధ్యాయ సంఘానికి శ్రీ కొమ్మినేని సుబ్బారావు గారిని అధ్యక్షులుగాను, శ్రీ యస్. లక్ష్మీనారాయణగారిని ప్రధాన కార్యదర్శిగాను ఎన్నుకొన్నారు.

రైతుకూలీ యాత్రికులపై పోలీసు దౌర్జన్యాలు

గిద్దలూరు సబ్‌జైలులోనున్న 36మందికి జామీను నిరాకరణ

కడపలో అనేకమందికి శిక్షలు, దర్శి తాలూకా గ్రామాలలో విచ్చలవిడిగా అరెస్టులు

[విశాలాంధ్ర విలేఖరి]

కంభం, మార్చి 31

రైతు - కూలీ యాత్రసందర్భంలో ఈనెల 20వ తేదీన, కంభం స్టేషనులో అరెస్టుచేయబడిన తాలూకా రైతు నాయకులు శ్రీ గద్దె రామయ్యగారిని దర్శి తాలూకాకు చెందిన మరి 35 గురు రైతుకూలీలను గిద్దలూరు సబ్‌జైలులో నిర్బంధించారు. 25 వ తేదీన వారిని జామీనుపై విడుదలచేయవలసిందని కోరుతూ వకీలు పిటిషన్ పెట్టడం జరిగింది. కాని మేజిస్ట్రేటు 27 వ తేదీకి వాయిదా వేస్తూ ఆనాటికి రావలసిందని తెలియ జేశారు. 27 వ తేదీని పోతే 29 వ తేదీకి వాయిదా వేశామన్నారు. జామీను దార్లతోసహా 29 వ తేదీకి పోతే ఏప్రిల్ 4 వ తేదీకి వాయిదా వేశారు.

ఆ ఒక్క రోజు యాత్ర ముగించుకొని త్వరలో ఇళ్లకు తిరిగి పోదామని ఆశించిన 36 మంది రైతు కూలీలు 10 దినాలుగా గిద్దలూరు సబ్‌జైల్లో బట్టలు వగైరా సౌకర్యాలులేక యమయాతనలు పడుతున్నారు. ఇళ్ల దగ్గర వారి భార్యా పిల్లలు తదితర బంధువుల వారిజాడ తెలియక ఆందోళన చెందుతున్నారు.

విచక్షణలేకుండా అరెస్టులు నిర్బంధాలు

కర్నూలు రైతు - కూలీ విజయ యాత్రను ముగించుకొని ఇండ్లకు తిరిగి పోతున్న రైతు కూలీలను యస్. ఎ. పి. పోలీసులు ప్రతిస్టేషనులోను పెట్టెలలోకి జొరబడి టిక్కెట్లు చూపమని నానా దుర్భాషలాడారు. ఆదేమన్యాయమని అడిగిన వారిని టిక్కెట్లులాక్కొని రైలు పెట్టెలలో నుండి క్రిందికి తోశారు. ఈవిధంగా టిక్కెట్లు వుండికూడా దింపివేయబడినవారిలో కడప, రాజంపేట, చిత్తూరు ప్రాంతాలకు చెందిన రైతులు, కూలీలు అనేకులు వున్నారు. మరుసటి రోజు ప్రయాణానికి ఆటిక్కెట్లు పనికిరావని యాత్రికులను రైళ్ళలో ఎక్కకుండా పోలీసులు నిరోధించారు.

అనేకమందిని పోలీసు స్టేషన్లకు తీసుకుపోయి సబ్‌జైళ్లలో నిర్బంధించారు. ఆవిధంగా కడపజైలుకు తీసుకొని పోయినవారికి ఒక్కొక్కరికి రు 6 జరిమానాలు, లేకపోతే 6 రోజులు శిక్ష విధించడం జరిగింది. ఈ విధంగా శిక్షింపబడిన వారిలో రాజంపేట ప్రాంతాలనుండి వచ్చినవారు 17 గురు, కమలాపురం తాలూకాకు చెందినవారు 8 మంది, కడపతాలూకాకు చెందిన వారు 10 మంది వున్నారు. వీరుగాక దూరప్రాంతాల వారుకూడా కొందరు వున్నారు.

దర్శితాలూకా గ్రామాలపై విచ్చలవిడి దాడులు

రైతుకూలీ యాత్ర అనంతరం దర్శి తాలూకా గ్రామాలపై ఎస్. ఎ. పి; రైల్వేపోలీసులు విచ్చలవిడిగా దాడులు సాగించారు. ముఖ్యంగా పొట్లపాడు, గంగదొనకొండ, గంగపవం, బోదనంపాడు, తూర్పుచౌటపాలెం, బొట్లపాలెం మొదలగు గ్రామాలపై దాడి చేసి అమాయక రైతులను, కూలీలను పోలీసు వ్యాన్‌లో ఎక్కించుకు పోయారు. కొందరిని గిద్దలూరు సబ్‌జైల్లో నిర్బంధించినట్లు తెలుస్తోంది. వారి సమాచారం తెలియక వారి భార్యాబిడ్డలు ఆందోళన చెందుతున్నారు.

వినుకొండ

వినుకొండగ్రామంలో కూరగాయల మార్కెట్ వద్ద మార్చి 23 వ తేదీన శ్రీ నాదెండ్ల ఆంజనేయులుగారి అధ్యక్షతను బహిరంగసభజరిగింది. రాష్ట్రరైతు నాయకులు శ్రీ చలసాని వాసుదేవ రావుగారు రాష్ట్రరైతుసంఘం యాత్ర జరిపి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన వినతిపత్రం, యాత్రావిశేషాలనుగురించి వివరించారు. రైతుసంఘ నిర్మాణావశ్యకతనుగురించినొక్కివక్కాణించారు.

ఆంధ్ర మహిళా మహాసభకు శ్రీమతి మోనికాఫెల్టన్‌రాక

విజయవాడ, ఏప్రిల్ 1

ఏప్రిల్ 10, 11 తేదీలలో కృష్ణాజిల్లా అంగలూరులో జరుగబోయే ద్వితీయ ఆంధ్రరాష్ట్ర మహిళా మహాసభకు సన్నాహాలు జోరుగా సాగుతున్నాయి.

సభకు శ్రీమతులు హజ్రాబేగం, రేణుచక్రవర్తి (యం. పి.), మోనికా ఫెల్టన్ (ప్రపంచ మహిళాసంఘ ఉపాధ్యక్షురాలు), ఆరుట్ల కమలాదేవి (ఎమ్. ఎల్. ఏ.) గారలు వస్తున్నారు.

మహాసభ సందర్భంలో సోవియట్ యూనియన్, చైనా, తూర్పుయూరపు ప్రజాస్వామిక దేశాల మహిళాభ్యున్నతిని, బిడ్డల సంరక్షణను, ఆదేశాల అభివృద్ధిని సూచించే ప్రదర్శన ఏర్పాటు చేయబడుతోంది.

మార్షల్ ముఖర్జీ

భారత వైమానికదళ సర్వసైన్యాధిపతిగానియామకం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1

ఎయిర్ వైస్‌మార్షల్ శ్రీ యస్. ముఖర్జీ ఏప్రిల్ ఒకటవ తేదీనుండి భారత వైమానికదళ సర్వసైన్యాధిపతిగా నియమించబడినట్లు నేడు రక్షణ మంత్రిత్వ శాఖ నుండి ఒక ప్రకటన వెలువడింది.

ఈపదవికి భారతీయుడు నియమించబడటం ఇదే ప్రథమసారి.

కళ్లేపల్లిరేగ

విశాఖజిల్లా కళ్ళేపల్లిరేగ బోర్డు ఉన్నతపాఠశాల వార్షికోత్సవం మార్చి 28 వ తేదీన శ్రీ రాంభొట్ల సత్యనారాయణపంతులుగారి అధ్యక్షతను జరిగింది. పెద్దలు ఉపన్యసించిన తరువాత, సారస్వత, ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంచబడినవి.

ప్రెస్‌కార్మికులకుప్రావిడెంట్ నిధి ఏర్పాటు చేయాలి

బందరు పట్టణ ప్రెస్ కార్మికసంఘ 11 వ వార్షికోత్సవ సభ తీర్మానం

బందరు, ఏప్రిల్ 1

ముప్పై నలభై సంవత్సరాల సర్వీసుగల ప్రెస్ కార్మికులు వృద్ధాప్యంలో ఎట్టి ఆధారములేక బాధలుపడుతున్నారు. అందుచే వారికిచ్చే జీతంలో రూపాయికి 0-1-6 చొప్పున యజమానులు కేటాయించి రెట్టింపు డబ్బు కలిపి బ్యాంకులో వేయాలి. అని కోరుతూ ఏప్రిల్ 28 వ తేదీన జరిగిన స్థానిక ప్రెస్ కార్మిక సంఘ వార్షికోత్సవ సభలో తీర్మానించారు.

టౌను హాలులో జరిగిన ఈ సభకు రాష్ట్ర ప్రెస్ కార్మిక నాయకులు శ్రీ బనిశెట్టి అప్పారావుగారు అధ్యక్షత వహించారు. రాష్ట్ర ట్రేడ్‌యూనియన్ సహాయకార్యదర్శి శ్రీ జోశ్యపట్ల సత్యనారాయణగారు సభను ప్రారంభించారు. అనేక పట్టణాలనుండి సభకు సౌహార్ద ప్రతినిధు లరుదెంచారు.

కృష్ణాజిల్లా ఫ్యాక్టరీ కార్మికసంఘ కార్యదర్శి శ్రీ వేములపల్లి హనుమంతరావుగారు ప్రెస్ కార్మికసంఘ కార్యాలయంపై ఉదయం ఎర్రజెండా ప్రతిష్టించారు.

ప్రెస్ కార్మికులకు 45 రోజులు (క్యాజువల్, సిక్ సెలవులు)ఇవ్వాలనీ, సంవత్సరానికి రెండు జతల దుస్తులు ఇవ్వాలనీ, ఆంధ్ర ప్రభుత్వ ప్రెస్‌ను అభివృద్ధిచేసి నిరుద్యోగులుగా ఉన్న ఆంధ్ర ప్రెస్ కార్మికులకు పనులు చూపించాలని, ప్రభుత్వ ప్రెస్‌లో మిగిలిన పనిని ఆంధ్రలో వివిధ ప్రెస్‌లకు యివ్వాలనీ, కోరుతూ సభలో తీర్మానాలు చేశారు.

ప్రెస్‌పరిశ్రమ ప్రెస్‌కార్మికుల స్థితిగతుల విచారణకు త్రైపాక్షిక కమిటీని వేయాలని కూడా తీర్మానించారు.

గుంటూరు మున్సిపల్ కార్మికుల సమ్మెవిషయంలో ప్రభుత్వం వెంటనే జోక్యం కల్పించుకొని పరిష్కరించాలనీ, బందరు స్పింటెక్సు కంపెనీ కార్మికులను తిరిగి పనిలో పెట్టుకోవాలనీ కూడా కోరారు.

బందరు ఓడరేవును ఆధునిక రేవుగా నిర్మించాలనికూడా మరో తీర్మానంచేశారు.

సాయంత్రం ఊరేగింపు అనంతరం బహిరంగసభ జరిగింది. సభకు డాక్టర్ కుప్పా వెంకట రామశాస్త్రిగారధ్యక్షత వహించారు. పలువురు వక్తలు కార్మికుల స్థితిగతులు నిరుద్యోగం మొదలైన సమస్యలపై మాట్లాడిన పిదప భీమవరం బాలికాపాఠశాలవారు కమ్మరిసొమ్ము బుర్రకథ చెప్పారు.

నాటక కళను పునరుద్ధరించవలసిన అవసరం

ఎంతైనా కలదని నాగయ్యగారి ఉద్ఘాటన

సామర్లకోట, మార్చి 27

నేటి సాయంకాలం ఆంధ్రా అమెచ్యూర్ నాటక సంఘ సమావేశం శ్రీ గరికపాటి రాజారావు గారధ్యక్షతను జరిగింది. ప్రఖ్యాత నటుడు శ్రీ చిత్తూరు వి. నాగయ్యగారిని నాటక సంఘం వారు సన్మానించారు. తనకు చేసిన సన్మానానికి కృతజ్ఞత తెల్పుతూ శ్రీ నాగయ్యగారు "మన తెలుగునాటకకళ అనేక కారణాలవల్ల క్షీణదశ పొందుతున్నది. దీని నుద్ధరించడానికొకజాతీయ రంగస్థలం మన కవసరం. ప్రభుత్వం విధించే అనేక రకాలైన పన్నులతో సతమతమౌతున్న ప్రజలురంగస్థల నిర్మాణానికి పూనుకోలేక పోతున్నారని" పేర్కొన్నారు. ఆంధ్ర అమెచ్యూర్ సంఘ అధ్యక్షులు శ్రీ సీతారాజుగారు నాగయ్యగారికి సన్మానపత్రం, శాలువ, రజిత పాత్రలను సమర్పించి సన్మానించారు. సన్మాన సభానంతరం "అన్నా చెల్లెలు" అనే నాటకం ప్రదర్శింపబడింది.

యాగంట

బనగానపల్లికి రెండుమైళ్ళదూరంలోనున్న యాగంటిలో మార్చి 29 వ తేదీన కర్నూలు జిల్లా వైద్యశాఖాధికారుల సమావేశం జరిగింది. సమావేశానికి సుమారు నలభైమంది డాక్టర్లు హాజరయ్యారు. గర్భవతులకు నూతనచికిత్సావిధానాన్ని గురించి శ్రీమతి [illegible] మాట్లాడారు. కోయిలకుంట్ల డాక్టరు సభికులకు విందు చేశారు.

ఆంధ్రరాష్ట్ర మత్స్య పారిశ్రామిక మహాసభ

ఆకివీడులో చురుకుగా సన్నాహాలు: ప్రతినిధులు, ప్రేక్షకులు విరివిగారావాలని విజ్ఞప్తి

ఆకివీడు, ఏప్రిల్ 1

ఆంధ్రదేశంలోని 5 లక్షలమంది మత్స్య పారిశ్రామికుల సమస్యలగురించి చర్చించుటకుగాను ఏప్రిల్ 5 వ తేదీన ఇచట జరుగనున్న ప్రథమ రాష్ట్ర మహాసభకు ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి.

మత్స్యపరిశ్రమ శాఖవారు మహాసభా సందర్భంలో వివిధ జాతుల చేపలు, వాటి పోషణ, పరిశ్రమ గురించిన నవీన విధానాలు మొదలగు వాటితో ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. మత్స్యపరిశ్రమ శాఖా మంత్రి గూడా మహాసభకు ఆహ్వానింపబడ్డారు. చాలామంది పార్లమెంటు సభ్యులు కూడా మహాసభకు రానున్నారు. వివిధ ప్రాంతాలనుండి మత్స్య పారిశ్రామిక సంఘ ప్రతినిధులు మహాసభకు రానున్నట్లుఆహ్వానసంఘకార్యాలయానికి తెలియజేస్తున్నారు.

మహాసభ ప్రతినిధులు ప్రేక్షకులు ఏప్రిల్ 5 వ తేదీ 11 గంటలకే ఆకివీడు చేరుకోవాలని కోరుతూ ఆహ్వాన సంఘంవారు నేడు ఒక విజ్ఞప్తిచేస్తూ ఇలా తెలిపారు.

మత్స్య పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ఇతోధిక సహాయం చేయకపోగా అభివృద్ధిపేరిట పారిశ్రామికులపై విధించిన పన్నులు పరిశ్రమను కృంగతీస్తున్నాయి. ఈపన్నులు చెల్లించుకోలేక పారిశ్రామికులు ఆకలి మంటలకు గురై, అనారోగ్యాలతోను, అంటు జాడ్యాలతోను కృశించుతున్నారు. అందుచేత పారిశ్రామికుల దుర్భర పరిస్థితులు తొలగించటానికి పరిశ్రమను నవీనపద్ధతులపైఅభివృద్ధిచేయడానికి మహాసభలో చర్చలు జరపాలి. పరిశ్రమ కేవలం ప్రభుత్వంమత్స్యశాఖ వారి వల్లనేకాక పారిశ్రామికుల విజ్ఞాన సహకారం కూడా కావాలి. అందుచేత వివిధజిల్లాల నుండి, గ్రామాలనుండి మత్స్యపారిశ్రామికులందరు మహాసభకు రావాలి. మీమీ అమూల్య అనుభవాలను యిచ్చి సభను జయప్రదం చేయాలని కోరుచున్నాము.

ఆకివీడుపట్టణం. గుడివాడ, భీమవరం రైల్వే లైనుమీద ఉందనీ రైలు స్టేషనులోదిగిన వెంటనే వలంటీర్ల సహాయము ఉంటుందని, మహాసభ ప్రతినిధులకు మాత్రమే భోజన సదుపాయాలుంటాయని ఆహ్వానసంఘం వారు తెలుపుతున్నారు.

విజయవాడ విశేషాలు

పట్టణ మహిళా సంఘ సమావేశం

6 వ తేదీన హనుమంతరాయ గ్రంథాలయంలో

విజయవాడ, ఏప్రిల్ 2

విజయవాడ పట్టణ మహిళా సంఘ సాధారణ సభ్యసమావేశం 6 వ తేదీ సాయంత్రం 4 గంటలకు హనుమంతరాయ గ్రంథాలయంలో జరుగుతుంది. రాష్ట్ర, పట్టణ మహాసభలకు సన్నాహాలు, ప్రతినిధుల ఎన్నికలు తదితర విషయాలు చర్చింపబడతాయని కార్యదర్శిని శ్రీమతి జోశ్యభట్ల సుబ్బమ్మగారు తెలియ జేస్తున్నారు.

నర్సారావుపేట డిప్యూటీ కలెక్టరు మార్చి 28 వ తేదీన తుమ్మకోటలో మకాం చేశారు. గ్రామంలోని దిగుడు బావి నీరు త్రాగుతున్నందువల్ల, తాము నారికురుపుల వ్యాధికి గురవుతున్నామని ఆ బావిని గిలకల బావిగా మార్పించాలని ఆయనను స్థానిక ప్రజలు కోరారు. గిలకల బావి నిర్మాణం త్వరలో జరుగునట్లు చూస్తానని ఆయనచెప్పారు.

సభలుసమావేశాలు

పశ్చిమ గోదావరిజిల్లా కల్లుగీత కార్మిక సంఘ విస్తృత సమావేశం ఏప్రియలు 0 వ తేదీన పశ్చిమ గోదావరిజిల్లా భీమవరం తాలూకా వీరవాసరంలో జరుగుతుంది.

◆ ◆ ◆

తెలంగాణా రచయితల సంఘం జనగాము శాఖ ఆధ్వర్యాన ఉగాది సాహిత్యగోష్టి [illegible] గ్రంథాలయ భవనములో సాయంత్రం గం. 6 లకు జరుగుతుంది.

రేడియో

ఏప్రిల్ 4 ఆదివారం

విజయవాడ : (367.1 మీటర్లలో) ఉదయము :

6-55 జయ ఉగాది - స్వాగతము, పద్యపఠనం, అద్దంకి శ్రీరామమూర్తి;
7-0 (తె. వా.);
7-15 మద్రాసు వలె;
8-0 (ఆం. వా);
9-0 జయారంభము కవి సమ్మేళనము ఉపక్రమణ తెన్నేటి విశ్వనాథం, సదస్యులు : కాంచనపల్లి కనకాంబ, వేదుల సత్యనారాయణ శాస్త్రి; కాటూరి వెంకటేశ్వర రావు, దీపాల పిచ్చయ్య శాస్త్రి, జంధ్యాల పాపయ్యశాస్త్రి, తాపీ ధర్మారావు, సలకా గణపతిశాస్త్రి, 'ఆరుద్ర';
1-0 మద్రాసువలె;
1-40 (హిం. వా);
1-50 (తె. వా.);
4-0 ఉగాది బొమ్మరిల్లు, పాటలు - నాటికలు;
6-0 గీతావళి : చిత్రపు సత్యాదేవి, చిత్రపు - కామేశ్వరి;
6-20 భజన్;
6-30 గ్రామస్థుల కార్యక్రమము-పోతన(బుర్రకథ)
7-0 (తె. వా.);
7-15 గ్రామస్థుల కార్యక్రమము -పోతన (రెండవ భాగము);
7-30 ప్రసంగము;
7-45 [illegible];
8-0 మద్రాసు వలె;
8-30 [illegible];
9-0 (ఆం. వా);
9-15 [illegible];
9-30 ద్వారం వెంకటస్వామి నాయుడు;
10-30 సమాప్తి.

మద్రాస్(బి) : (270.3 మీటర్లలో) (ఉదయం)

6-55 స్వాగతము
7-0 (తె. వా.);
7-15 జయాభి వందనం- పద్యపఠనము, దేవులపల్లి వెంకటకృష్ణశాస్త్రి;
8-0 (ఆం. వా);
9-0 కవి సమ్మేళనము;
1-0 యం. శ్రీ[illegible];
1-30 (ఆం. వా);
1-40 గీతికాపాఠం - డి. పార్వతి : ఆర్. పద్మ;
1-50 (తె. వా.);
2-0 వేణువు;
2-15 ఆటవిడుపు;
4-0 జయనీరాజనము - ఉగాది పాటలు - ఎస్. రాజేశ్వరరావు;
6-15 వీణ, [illegible];
6-30 గ్రామసీమ, పోతన బుర్రకథ;
7-0 (తె. వా.);
7-15 గ్రామసీమ, పోతన (రెండవ భాగము);
7-30 విజయవాడ వలె;
7-45 మద్రాసు వలె;
8-0 [illegible];
8-30 ఎస్. ఎ. సుందరం పదాలు, జావళీలు;
9-0 (ఆం. వా);
9-15 [illegible] 'వసంతము' వివిధ ప్రాంత భాషలలో [illegible] లక్ష్మీకాంతం, విజయమూరి [illegible];
9-30 విజయవాడ వలె;
10-30 సమాప్తి.

హైదరాబాద్ : (411.0 మీటర్లలో (ఉదయము)

6-55 సుప్రభాత్;
7-0 (తె. వా.);
7-15 ఉగాది ఆశీస్సులు పద్యపఠనము;
7-45 గీత్;
8-0 (ఆం. వా.);
8-15 (హిం. వా.);
8-30 ఖయాల్;
9-0 ఆవో బచ్చో;
9-45 బాలవినోదం, వచ్చె చైత్రమాసముప్రియ భారత జననీ వచ్చింది నవ్వు ఉగాది గోష్టిగానం వీరగాథలు. ఏకలవ్యుడు ప్రసంగము;
12-30 [illegible];
12-50 (మ. వా);
1-0 ఖయాల్;
1-30 ఆరాధన;
1-50 (తె. వా.);
5-30 సితార్;
5-45 [illegible]:గీత్
6-0 వు. కార్యక్రమం;
6-30 [illegible];
6-40 స్థానిక ప్రకటనలు;
6-45 గ్రామసీమ, విచిత్ర సంభాషణ - హాస్య రచన;
7-0 (తె. వా.);
7-15 గ్రామసీమ, ఉగాది రూపకము;
7-45 (హిం. వా);
8-0 జయ ఉగాది కార్యక్రమము [illegible] గీతావళి;
9-0 (ఆ. వా.);
9-15 (ఉ. వా.);
9-30 సితార్;
9-45 ఖయాల్;
10-15 సితార్;
10-30 సమాప్తి.

హైద్రాబాద్ రాష్ట్ర విభజన సమస్యపై ప్రభుత్వ పక్షంవారి మూగనోము

శాసనసభలో ప్రతిపక్ష సభ్యుల విమర్శ

[విశాలాంధ్ర విలేఖరి]

హైద్రాబాద్, ఏప్రిల్ 1

హైద్రాబాద్ రాష్ట్రాన్ని భాషాప్రయుక్తంగా విభజించే సమస్యపై ప్రభుత్వం మౌనం వహించుతున్నందుకు పలువురు ప్రతిపక్షసభ్యులు నిన్న శాసనసభ చర్చలసందర్భంలో విమర్శించారు.

ప్రశ్నోత్తరాల అనంతరం ఆర్థిక మంత్రి శ్రీ విద్యాలంకార్ హైద్రాబాద్ రాష్ట్ర సప్లిమెంటరీ అప్రోప్రియేషన్ బిల్లును సభముందు పెట్టారు.

శ్రీ వి. డి. దేశముఖ్ (ఫ్రంట్) దానిమీద ఈవిధంగా ఉపన్యసించారు.

“ఏటేటా ఆర్థికమంత్రి పాడినపాటే పాడుతున్నారు. ప్రజల కష్టాలు ఎక్కడివి అక్కడే వున్నాయి.

“ఇంతవరకు రాష్ట్ర పునర్విభజన సంఘం ముందు పెట్టే విషయం యేమిటో ప్రభుత్వం బయటపెట్టలేదు. భాషారాష్ట్రాల విషయంలో మీ ఆలోచన ఏమిటి? రాజప్రముఖ్ వ్యవస్థను రద్దుపరచడానికి ప్రభుత్వం ఏంచేసింది? వీటికి సమాధానంచెప్పాలి.

“ప్రభుత్వం ప్రజలపై నిర్బంధాలను యథేచ్ఛగా సాగిస్తూంది. రెండురోజుల క్రితమే పాలిష్ మిల్లు కార్మికులపై లాఠీలు బాష్పవాయువు ఉపయోగించారు. కార్మికుల మెమొరాండాన్ని చూడగల శక్తి కూడా ప్రభుత్వానికి లేకపోయింది. శాంతంగా కూర్చున్న కార్మికులపై పోలీసులు దౌర్జన్యంచేసి ఒక కార్మికుని కాలి ఎముక విరుగకొట్టారు.”

వి. బి. రాజు: ఈ ఉపన్యాసం సమయోచితమా?

కోటేచా: రాజప్రముఖు ఉపన్యాస విమర్శనా యిది?

శ్రీ దేశముఖ్ తాము అప్రోప్రియేషన్ బిల్లుపై ఉపన్యసిస్తున్నామని గుర్తు చేసి ఇల్లా చెప్పారు.

“నిరుద్యోగ సమస్య కమిటీల నియామకంతో తీరదు. మరాట్వాడా తాలూకాలలో మైనరు ఇర్రిగేషను స్కీములను ఆచరణలో పెడతామని చేస్తున్న వాగ్దానాలు నెరవేరలేదు. నందికొండ ప్రాజెక్టు గతికూడా అంతే. ప్రభుత్వం ఇంతవరకు ఏంచేసింది?

“కరువు నివారణకై ధనం పోగుపడుతుందేగాని ఒక కమిటీకూడా ఏర్పడదు. నివారణ ప్రయత్నాల వివరాలు తెలియవు.”

శుష్క వాగ్దానాలు

“జాగీర్దారీ గ్రామాలలో ఇంతవరకు బందోబస్తు చేస్తున్నామనేమాటేగాని, అది పూర్తి అయ్యే ధోరణి కనబడదు. [illegible] మీద ప్రభుత్వం వాగ్దానాలు చేస్తూంది. కాలం గడుపుకొంటూంది. కాని వాటి ప్రజా వ్యతిరేక ధోరణులు మానలేదు.

“అమెరికను డబ్బుతో కమ్యూనిటీ ప్రాజెక్టుల కార్యక్రమం సాగించుతున్నారు. పాకిస్తాన్‌లో అమెరికా నాటకం గుర్తించుకొని వ్యవహరిస్తున్నారా?”

మంత్రి జవాబు

శ్రీ విద్యాలంకార్ సమాధానం చెప్తూ ఈ బిల్లులోని పద్దులన్నిటిమీదా ఓ నెలనుంచి ఉపన్యాసాలు, విమర్శలు, ప్రశ్నలు అయిపోయాయి గనక నేను వేరే చెప్పనక్కర్లేదన్నారు. రాష్ట్ర పునర్విభజన సంఘం ఎదుట కాంగ్రెసు తన అభిప్రాయాన్ని పెట్టేటందుకై కమిటీని నియమించారని, ఆసంఘం నిర్ణయం వచ్చేవరకు ప్రభుత్వం ఏ కార్యక్రమాన్ని అనుసరించలేదు అన్నారు. ఎవరయినా చట్టాన్ని ధిక్కరించినప్పుడు వచ్చే నిస్పంధాన్ని నిర్బంధ చర్యలన దానికి వీలులేదు. ఆసెంబ్లీకి ఊరేగింపుగావచ్చి ప్రజల్ని అదుపులో వుంచడం సాధ్యంకాదుగనక ముందు జాగ్రత్తకై నిషేధాలను అమలు జరపడం అవసరం అయిందన్నారు. ప్రభుత్వం స్వతంత్రంగా పనిచేసేటందుకు వీలు కలిగించాలని, ఆ రోజున అతిప్రధాన మయిన అప్రోప్రియేషన్ బిల్లుల చర్చ జరుగుతూండినదని ఆ ఊరేగింపును చెదరగొట్టడంలో ప్రభుత్వం ఉచితమైనపని చేసిందన్నారు.

తర్వాత ఆ బిల్లు రెండు మూడు పఠనాలు కూడా పూర్తి అయి సభ ఆమోద ముద్రపొందింది.

శ్రీ విద్యాలంకార్ తర్వాత హైద్రాబాద్ రాష్ట్ర అప్రోప్రియేషన్ బిల్లును సభ ముందుంచారు.

శ్రీ కె. అనంతరెడ్డి ఇల్లా అన్నారు. “పన్నులు పరాకాష్టకి చేరాయి. ఇంక అదనంగా ఇచ్చేటందుకు ప్రజలు సిద్ధంగాలేరు. ప్రభుత్వం ఖర్చులు తగ్గించుకొని, పునర్నిర్మాణ కార్యక్రమాలకు పూనుకోవాలి. ప్రజల సగటు ఆదాయం పెరిగేటందుకు తోడ్పడాలి. మూడేళ్ళనుంచి ఈ ఆదాయం ఎదుగు బొదుగులు లేకుండా వున్నదని కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీయే తెలిపింది. ఈ అభివృద్ధి కలిగినప్పుడే తప్ప ప్రజలకు సహాయం లభించదు.”

శ్రీ గవానే (యు.పి.పి.) ఉపన్యసిస్తూ ఇల్లా అన్నారు:

రాష్ట్ర విభజన గురించి మూగ నోము

“హైద్రాబాదు రాష్ట్ర విభజన విషయమై ప్రభుత్వ దృక్పథం తెలుపమని సభ్యులుకోరారు. ప్రజలు దానినే తెలుసుకో గోరుచున్నారు. కాని, దానిని ప్రభుత్వం తెలుప నిరాకరిస్తున్నది. ఇది కాంగ్రెసు వాదులు ప్రజలముందు చేసిన వాగ్దానాలను భంగంచేయడమే. ప్రజా ప్రతినిధులమేనని మహా చెప్పుకుంటున్నవారు ప్రజాభిప్రాయాన్ని ఇంత చులకనగా నిరాకరించడం సిగ్గుచేటు.

“చట్టాన్ని ధిక్కరించిన వారిని కొట్టడం దౌర్జన్యం కాదన్నారు. చట్టధిక్కారణకు శిక్షలున్నాయి. కోర్టులున్నాయి. ఆ శిక్షలు వేయండి. శిక్షించండి. కాని, శాంతంగా జరుపుతున్న ప్రదర్శనపై లాఠీలతో కొట్టడం, బాష్పవాయువు వుపయోగించడం దౌర్జన్యం కాక మరేమిటి? బహుశా లాఠీలతో కొట్టడం అహింస అనుకొంటూండి వుంటారు. ఆడవాళ్ళని కూడా కొట్టారు. 28 రోజుల నుంచి నిరాహార వ్రతం చేస్తున్న ఆ కార్మికుని భార్య మంత్రి వద్దకు తన దరఖాస్తుతో వస్తూంటే ఆమెను కొట్టారు. మీ భార్య ఆ దశలో వుంటే, ఆ దెబ్బలే ఆమెకు తగులుతే అవి దౌర్జన్యం అవుతాయో కాదో ఆలోచించి చెప్పండి.”

శ్రీ శరణ్‌గౌడ్ ఇనాందార్ (స్వతంత్ర) ఇల్లా అన్నారు:

“పోలీసు ఇన్‌స్పెక్టరుకు జీతం అన్నీ కలిపి 54 రు. లు దొరుకుతాయి. నేటి పరిస్థితులలో ఎవ్వరూ దానితో బ్రతుకలేరు. కనకనే లంచగొండితనం పెరిగిపోతూంది. సరిహద్దులలో సుంకశాలలలోని రక్షకభటులు లంచాలు తీసుకొని ఎంతో సరుకును బయటకు పోనిస్తున్నారు. ప్రభుత్వాదాయం తగ్గిపోతూంది.

“ఏ ఉద్యోగికీ రు. 100 ల జీతానికి తక్కువుండకూడదు. అప్పుడే లంచగొండితనం తగ్గుతుంది.

ఎగువ కృష్ణా ప్రాజెక్టు

“గుల్బర్గా జిల్లాలోని ఎగువ కృష్ణా ప్రాజెక్టును నిర్మించేటందుకు ప్రభుత్వం ప్రయత్నించడంలేదు. దానికి హైద్రాబాదు ప్రభుత్వం 15 కోట్లు ఖర్చుచేస్తే బొంబాయి ప్రభుత్వంకూడా కలిసి వస్తుంది. దానివలన చాల వినియోగం వుంది.

చర్చకు శ్రీ వినాయకరావు విద్యాలంకారు యిచ్చిన సమాధానంలో అవినీతి రద్దుకావాలనే ప్రభుత్వం కోరుతున్నదని చెప్పారు.

“హైద్రాబాద్ రాష్ట్ర విభజన విషయమై కాంగ్రెసు అధిక ప్రచారం చేయబోదు. రాష్ట్ర విభజన సంఘం రిపోర్టుకోసం వారికి కనిపెట్టుకొని వుంటారు.

“శాంతంగా జరుగుతున్న వూరేగింపుమీద పోలీసులు దాడిచేశారన్నది అబద్ధం. దరఖాస్తు ఇవ్వడానికి వూరేగింపు ఎందుకు? వూరేగింపులు శాంతి సంరక్షణకోసం లేవదీయరు. గొడవ, ప్రచారం లేవదీయడానికే తీస్తారు. ప్రజాస్వామ్య దేశాలలో ఊరేగింపులు అవసరంలేదు. నియంతృత్వ దేశాలలో దాని అవసరం వుంది. ఊరేగింపులతో ప్రభుత్వ అభిప్రాయాలలో మార్పు తేవాలనుకొనేవారు పొరపడుతున్నారు.

అమెరికన్లయెడ మంత్రి ప్రేమ

“అమెరికనులంటే మాకు భయం లేదు. వారంటే ప్రేమ వుండడం తప్పలేదు. అమెరికనులు వచ్చి ఏంచేస్తారు? చూస్తారు. పోతారు. రష్యాను అభిమానిస్తున్నామో లేదో చూస్తారంటూరా? మనం తటస్థులం; డబ్బు ఖర్చుచేసుకొని వచ్చి చూస్తే చూడనివ్వండి. వారు చూడకూడనిది మనదేశంలో ఏంవుంది? మన అంతర్జాతీయ విధానమే అత్యద్భుతం. దానిని చూసి యూరోపు దేశాలు కూడా ఆశ్చర్యపడుతున్నాయి.

తర్వాత బిల్లు ప్రథమ పర్యాయం వోటుకు పెట్టి ఆమోదించబడినట్లు ప్రకటించారు.

తర్వాత క్లాజులవారీగా బిల్లును ఎత్తుకొన్నారు. చర్చలు లేకుండానే బిల్లు రెండవమారు, మూడవమారుకూడా చదవబడి చట్టంగా రూపొందింది.

సప్లిమెంటరీ (2) అప్రోప్రియేషన్సు బిల్లు

తర్వాత సప్లిమెంటరీ (రెండవ) అప్రోప్రియేషన్సు బిల్లు సభముందుకు వచ్చింది. చర్చలులేకుండానే రెండవ, మూడవమారు సభముందు పెట్టబడి ఆమోదించబడినట్లు ప్రకటించబడింది.

హైద్రాబాద్ రాష్ట్ర విభజన

కాంగ్రెసు వైఖరిపై ఆర్థిక మంత్రి వివరణ

హైదరాబాదు, మార్చి 31

హైదరాబాదు రాష్ట్రాన్ని విడగొట్టాలనే తీర్మానాన్ని కాంగ్రెసు పార్టీ ప్రతిపాదించబోదని ఆర్థిక మంత్రి శ్రీ వినాయకరావు విద్యాలంకార్ నేడు శాసనసభలో ప్రకటించారు.

ఈ విషయమై ఉన్న బాధ్యతాయుత విచారణసంఘం నివేదికకోసం వేచిచూడాలని కాంగ్రెసు తన విధానాన్ని ఇదివరకే ప్రకటించిందని అతను చెప్పారు. తన పార్టీలో బాధ్యతగల సభ్యుడేనయకాని ఇంతవరలోగా ఎట్టిచర్య తీసుకోబోడని కూడ శ్రీ విద్యాలంకార్ అన్నారు.

కార్యనిర్వాహక న్యాయశాఖల విభజన

పశ్చిమ గోదావరిజిల్లాలో అమలు

కర్నూలు, ఏప్రిల్ 1

న్యాయ - కార్యనిర్వాహక శాఖల విభజన నేటినుంచీ పశ్చిమ గోదావరి జిల్లాలో అమలులోనికి వస్తుందని ఆంధ్ర ముఖ్యమంత్రి శ్రీ టంగుటూరి ప్రకాశంగారు నేడు ఇక్కడ పత్రికా గోష్ఠిలో వెల్లడించారు.

క్రమంగా అన్ని జిల్లాలకు ఈ విభజనను ఎప్పుడు విస్తరింపచేస్తారని అడగగా ఆ సమస్యను ప్రభుత్వం ఈ ఏడాదే ఆలోచిస్తుందని పంతులుగారితో పాటే పత్రికా గోష్ఠిలో పాల్గొన్న శ్రీ తెన్నేటి విశ్వనాథం గారన్నారు.

కృష్ణా గోదావరి గుంటూరు జిల్లాలలో తప్ప మిగతా అన్ని జిల్లాలలో ఈ పద్ధతి అమల్లో వుందని ఆయన చెప్పారు.

విమానాశ్రయం

కర్నూల్లో విమానాశ్రయం ఎప్పుడు నిర్మిస్తారని ప్రశ్నించగా, విమానాశ్రయ నిర్మాణానికి మూడు అనువైన స్థలాలు ఉన్నాయని, ఏమయినప్పటికీ రెండు నెలల్లో విమానాశ్రయం నిర్మించబడుతుందని శ్రీ విశ్వనాథంగారన్నారు.

శాసనసభ వేసవి సమావేశం

శాసనసభ వేసవిసమావేశం, అంటే మే 10వ తేదీనుంచి ప్రారంభంకానున్న సమావేశం వాల్తేరులో జరుగుతుందని శ్రీ విశ్వనాథంగారు ప్రకటించారు.

ఆంధ్ర ప్రభుత్వ వేసవి మకాంను వాల్తేరుకు మారుస్తారా అని ప్రశ్నించగా ప్రభుత్వానికి అట్టి వుద్దేశంలేదని శాసనసభ సమావేశానికి అవసరమైన సిబ్బంది మాత్రమే అక్కడకు తరలించబడుతుందని అయన అన్నారు.

12 ఫ్రెంచి ఇండియా గ్రామాలపై ప్రజాధికారం

విముక్తి సమరంలో ఐక్య సంఘటనకై వివిధ పార్టీలమధ్య సమాలోచనలు

పుదుచ్చేరి, ఏప్రిల్ 1

ఫ్రెంచిఇండియా అధికారులు నేడు 5 లారీలనిండా సాయుధ పోలీసులను పుదుచ్చేరి సరిహద్దులకు పంపారు. అయితే వారు ఖచ్చితంగా ఏ ప్రాంతానికి వెళ్ళిందీ తెలియలేదు.

నిన్న ఫ్రెంచి ఇండియా సోషలిస్టు నాయకులు ఆక్రమించుకున్న నెట్టకుప్పంవద్దకు ఈ సాయుధ దళాలు పంపబడి వుంటాయని భావిస్తున్నారు. ఆ ప్రాంతంలో 12 గ్రామాలపై శ్రీ గౌబర్ట్ ప్రభృతులు అధికారం స్థాపించారు.

ఈ గ్రామాలలో 14 వేలమంది ప్రజలున్నారు. ఫ్రెంచి పోలీసులు భారత భూభాగంలోకి రాకుండా సరిహద్దులలోని భారతీయసాయుధదళాలు కూడా సమాయత్తం చేయబడినట్లు తెలుస్తున్నది.

శ్రీ గౌబర్ట్ నెట్టకుప్పం గ్రామంలో తన కార్యాలయం స్థాపించారు. అక్కడ నేడు పత్రికా విలేఖరులు ఆయనను కలుసుకోగా “ఈ ప్రదేశంలో ఫ్రెంచిఇండియా కమిషనర్ మేనార్డు అధికారం సాగదు. అతడు సరియైన మనిషైతే ఈదేశంవదలి వెళ్ళిపోవాలి” అన్నారు.

ఫ్రెంచి ఇండియా పరిపాలన స్తంభించి పోయిందని, పరిపాలన స్వాధీనం చేసుకోవలసిందిగా తాము త్వరలో భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తామని శ్రీ గౌబర్ట్ చెప్పారు. నెట్టకుప్పంలోకి ఫ్రెంచివారు సాయుధ దళాలను తెస్తారన్న విషయం ప్రస్తావించగా, అటువంటి సాధ్యతేమీ తెలియడం లేదన్నారు.

“సాయుధ దళాలన్నీ భారత భూభాగం ద్వారా రావాలి. భారత భూభాగంలోకి విదేశీ సాయుధ పోలీసుల ప్రవేశాన్ని సహించబోమనీ, అది అంతర్జాతీయ న్యాయశాస్త్రాలకు విరుద్ధమనీ ఇండియా ప్రభుత్వం స్పష్టంచేసింది. ఆ మాటలలో మాకు పూర్తి నమ్మకముంది.

అయితే దేశద్రోహచర్యల నణచేందుకు తమ సాయుధ పోలీసులకు దారి ఇవ్వవలసిందిగా ఫ్రెంచి ప్రభుత్వం ఇండియా ప్రభుత్వాన్ని కోరవచ్చు. దీనికి నా జవాబేమిటంటే, ఫ్రెంచి ఇండియా మంత్రివర్గంలో నేను ఐదేళ్లుగా మంత్రిగా వున్నాను. నన్ను ఇప్పుడు దేశద్రోహ చర్యలు జరుపుతున్నట్లు నిందించలేరు.”

నిన్న పుదుచ్చేరిలో జరిగిన విలీనీకరణ వ్యతిరేక ప్రదర్శనాన్ని ప్రభుత్వమే ఏర్పాటుచేసిందని, అందుకుతగినవ్రాతమూలకమైన రుజువుందని శ్రీ గౌబర్ట్ చెప్పారు. పుదుచ్చేరిలో ప్రదర్శనానికి మనుష్యులనుపంపవలసిందిగా అన్ని పోలీసు స్టేషన్లకు పంపబడిన సర్క్యులర్లను ఆయనచూపించారు.

ఐక్యసంఘటన నిర్మాణానికి విలీనీకరణ అనుకూల పార్టీల మధ్య జరుగుతున్న సంభాషణలను ప్రస్తావించి, ఇంకా సంప్రతింపులు సాగుతున్నవని, తాము త్వరలో కడలూరులో సమావేశమవుతామని చెప్పారు.

నిన్నరాత్రి నెట్టకుప్పంలో బహిరంగ సభ జరిగింది. గౌబర్ట్ ప్రభృతులు ప్రసంగించారు. సుమారు 4 వేలమంది ప్రజలు సభకు హాజరైనారు.

విలీనీకరణ ఉద్యమంపట్ల సానుభూతి ప్రకటిస్తూ అల్జీరియన్ పీపుల్స్ పార్టీ కైరోలోని అల్జీరియన్ విద్యార్థులు శ్రీ గౌబర్ట్‌కు కేబుల్ పంపారు. ఫ్రెంచి ఇండియా అధికారుల నిర్బంధ చర్యలను వారు నిరసించారు.

ఫ్రెంచి ఇండియా మంత్రి శ్రీ ఎ. వి. దేవశిఖామణి నేడు పి. టి. ఐ. విలేఖరితో మాట్లాడుతూ, రెఫరెండం లేకుండా ఫ్రెంచి స్థావరాలు ఇండియాలోకలిసిపోవాలని తాను, తన సహచరులిద్దరూ ఫ్రెంచి సముద్రాంతరశాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్‌కు తెలియజేశామన్నారు.

ఫ్రెంచి ప్రాంతాల్లో నిర్బంధ విధానం

ప్రజాసభలో నెహ్రూ ప్రకటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1

భారత దేశంలోని ఫ్రెంచి వలస ప్రాంతాల్లో ఫ్రెంచి అధికారులు విపరీతమైన నిర్బంధ విధానాన్ని సాగించుతున్నారని భారత ప్రభుత్వానికి తెలియవచ్చిందని నేడు ప్రజాసభలో ఒక ప్రశ్నకు సమాధానం చెప్తూ ప్రధాని నెహ్రూ తెలియజేశారు.

రెండు మూడు రోజుల్లో ఈ విషయమై వివరమైన ఒక ప్రకటన చేయగలనని ప్రధానమంత్రి చెప్పారు.

మరో ప్రశ్నకు నెహ్రూ జవాబు చెప్తూ పుదుచ్చేరిలోని భారత రాయబార కార్యాలయం ముందు ఫ్రెంచి అధికారులు తమ పోలీసులను కాపలా పెట్టి లోపలికి వచ్చి వెళ్ళేవారిని అనేక రకాలైన ప్రశ్నలను వేస్తున్న మాట నిజమేనన్నారు.

భారత భూభాగంలో సంలీనం కావాలనే కొంతమంది ప్రజలు నెట్టకుప్పం కమ్యూన్‌లోని కొన్ని గ్రామాలను వశపరచుకొన్నారనీ, వారిపై ఫ్రెంచి అధికారులు నిర్బంధవిధానాన్ని సాగించుతున్నారన్న వార్త ప్రభుత్వానికి తెలిసిందనికూడా నెహ్రూ తెలియజేశారు.

తంతి తపాలా శాఖ ఆర్థిక వ్యవహారాలు

విచారణకు పార్లమెంటరీ సంఘాన్ని నియమించాలని శ్రీ విఠలరావు డిమాండ్

[o]

రహదారుల మంత్రిత్వశాఖ పద్దుపై ప్రజాసభ చర్చ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1

తంతి, తపాలాపనివారు గృహసౌకర్యాలు లేక చాల అవస్థ పడుతున్నారంటూ, తంతి, తపాలా డిపార్టుమెంటు ఆర్థికవ్యవహారాలను విచారించేందుకు ఒక పార్లమెంటరీ కమిషన్‌ను నియమించాలని నేడు ప్రజాసభలో మాట్లాడుతూ కమ్యూనిస్టుసభ్యుడు శ్రీ టి. బి. విఠల్‌రావుగారు కోరారు.

నేడు ప్రజాసభలో రహదారుల మంత్రిత్వశాఖ పద్దుపై చర్చ జరిగింది. ఈ యేడాది బడ్జెట్‌లో రహదారుల మంత్రిత్వ శాఖ ఖర్చునిమిత్తం 72 కోట్ల మొత్తం కేటాయించబడింది. ఇందులో 24 కోట్ల రూపాయలు పెట్టుబడి ఖర్చులకు ప్రత్యేకించ బడినాయి.

ఈ వేళ రోజంతా ఈ పద్దుపైచర్చ జరిగి ఆమోదించ బడింది.

చర్చకు రహదారులశాఖ మంత్రి శ్రీ జగజీవన్‌రామ్ సమాధానంచెప్తూ వచ్చే ఒకటి రెండు మాసాల్లో నేడు నిరుద్యోగులుగా ఉండి, డకోటాలను నడిపించేందుకు సర్టిఫికేట్లుగల వైమానికులందరూ పనుల్లో తీసుకోబడతారని తెలిపారు.

రాష్ట్రాల రాజధానులన్నిటినీ విమాన మార్గం ద్వారా కలిపే ఒక స్కీము ప్రభుత్వ ఆలోచనలో ఉన్నదని కూడా చెప్పారు.

పద్దుపై చర్చ సందర్భంలో కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ టి. బి. విఠల్‌రావు (హైద్రాబాద్) ప్రసంగిస్తూ ఎన్నో కష్టాలను ఎదుర్కొనవలసి వచ్చినప్పటికీ తంతితపాల శాఖను సమర్థతతో నిర్వహించగలుగుతున్న తంతితపాల ఉద్యోగులను అభినందించారు.

తపాలా పనివారి ఇక్కట్లు

రహదారుల మంత్రిత్వశాఖ ఆర్థిక విధానాన్ని శ్రీ విఠల్‌రావుగారు విమర్శించుతూ పనివారికి ప్రభుత్వం కనీస సౌకర్యాలను చేయలేకపోతున్నదన్నారు. గత సంవత్సరంలో తంతి తపాలా ఉద్యోగుల సౌకర్యాలకోసం ఆరు లక్షల రూపాయలను మంజూరు చేసినప్పటికీ ఆచరణలో రెండున్నర లక్షలు ఖర్చుపెట్టినది మూడు లక్షలు మాత్రమేనని తెలియజేశారు. ఈ సంవత్సరం ఆఖరువరకూ తిరిగి రెండున్నర లక్షలు మాత్రమే కేటాయించబడిందని కూడా చెప్పారు.

ఇతర డిపార్టుమెంటులలో వారానికి 36 గంటలు పనిమాత్రమే ఉండగా పోస్టల్ డిపార్టుమెంటులో వారానికి 48 గంటలపని ఉంటున్నదంటూ ఈ వివక్షతను ఎందుకు చూపెట్టాలని శ్రీ విఠల్‌రావుగారు ప్రశ్నించారు.

పోస్టాఫీసులలో ఉత్తరాలను తీసి చూడటం ఇటీవల మరీఎక్కువైనదనీ, ఇది ప్రజాస్వామ్య పరిపాలన సూత్రాలకు పూర్తిగా విరుద్ధమని విమర్శించారు.

దేశంలో పోస్టల్ సౌకర్యాలను విస్తరింపజేయడంలో ప్రభుత్వం మందకొడిగా నడుస్తున్నదంటూ 55 వేల జనాభాగల వరంగల్ పట్టణానికంతటికీ ఒకే ఒక పోస్టాఫీసు ఉన్నదనీ, మంత్రిగారు శాంక్షన్ చేశామంటున్నారు కాని ఇంతవరకూ జరిగిందేమీ లేదని శ్రీ విఠల్‌రావుగారు విమర్శించారు.

శ్రీ రామస్వామి మొదలియార్ (కాంగ్రెసు - మద్రాసు) మాట్లాడుతూ 150 సంవత్సరాలుగా బ్రిటిషు వారు మనదేశాన్ని పరిపాలించి ఎన్ని పోస్టాఫీసులు స్థాపించారో దాదాపు అన్ని కొత్త పోస్టాఫీసులు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత స్థాపించబడినాయని పేర్కొన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల్లోని ప్రజలకు హిందీ తెలిసిన తరువాతనే ఇంగ్లీషుకు బదులు తంతి తపాలాశాఖలో హిందీని ప్రవేశపెట్టాలని కోరారు.

శ్రీ సతీష్ చంద్ర సమంత (కాంగ్రెసు - బెంగాల్) రైల్వే పనివారలకువలెనే తంతి తపాలాశాఖలోని ఉద్యోగుల బిడ్డలకు కూడా వైద్య, విద్యా సౌకర్యాలను కలుగజేయడానికి ఏర్పాటుచేయాలని కోరారు.

శ్రీ యస్. డి. జోషి (కాంగ్రెసు బొంబాయి) బొంబాయి నగరంలోని అనేక ప్రాంతాల్లో పోస్టాఫీసులను తెరువవలసిన అవసర మున్నదన్నారు.

శ్రీ జయపాల్ సింగ్ (స్వతంత్ర) పౌర విమానశాఖను రక్షణ శాఖతో కలిపివేయాలని కోరారు. శ్రీ రఘుబీర్ సాహా (కాంగ్రెసు - యు.పి) ఇటీవల దేవనాగరిలో టెలిగ్రాములసంఖ్య అధికమవుతున్నందుకు తన సంతృప్తిని వెల్లడించారు.

శ్రీమతి తారకేశ్వరిసిన్హా (కాంగ్రెస్ బీహార్) మాట్లాడుతూ రహదారుల మంత్రిత్వశాఖ కొన్ని సంవత్సరాలుగా ముందుకు వెళ్లడానికి బదులు వెనక్కి నడుస్తున్నదనీ, సమర్థత కూడా తగ్గిపోయిందనీ విమర్శించారు.

శ్రీ వి. మునుస్వామి (కాంగ్రెసు - మద్రాసు) తంతితపాలా ఉద్యోగుల కష్టాలను మంత్రి గుర్తించినప్పటికీ వాటిని తొలగించేందుకు ఏమీ చేయకపోవడం ఆశ్చర్యకరమన్నారు.

శ్రీమతి రేణు చక్రవర్తి (కమ్యూనిస్టు) ప్రసంగిస్తూ పౌర విమానశాఖలో వస్తున్న నష్టాన్ని గురించి ప్రస్తావించారు. పౌర విమానశాఖను జాతిపరం చేసినప్పుడు ఉద్యోగుల పూర్తి సహకారాన్ని తీసుకోవడం అత్యవసరమని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఇండియా - అమెరికా ఆర్థిక ఒడంబడికలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1

భారతదేశంలో కొన్ని ప్రాజెక్టుల నిర్మాణానికి అమెరికా ఆర్థిక సహాయం చేసే సందర్భంలో ఉభయదేశాల ప్రతినిధులు నేడు నాలుగు ఒడంబడిక పత్రాలపై సంతకాలు పెట్టారు.

మొదటి ఒడంబడిక ప్రకారం అదనంగా మరొక 150 కమ్యూనిటీ ప్రాజెక్టులకోసం అమెరికా రెండున్నర కోట్ల రూపాయలు సహాయం చేయడానికి ఆమోదించింది. ఈ ప్రాజెక్టులకోసం ఇండియా స్వంతంగా 27 కోట్ల 31 లక్షల రూపాయలను ఖర్చుపెడుతోంది.

రెండో ఒడంబడిక ప్రకారం చేపల పరిశ్రమను ఆధునిక పద్ధతులతో అభివృద్ధి చేయడంకోసం ఇండియా 28లక్షల 34 వేల రూపాయలను ఖర్చుపెడుతోంది. దీనికిగాను అమెరికా 27 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేస్తుంది.

మూడో ఒడంబడిక వ్యవసాయానికి సంబంధించిన ఇనుము, ఉక్కుకు సంబంధించినది. నాలుగోది ట్రాక్టర్ల వ్యవస్థలను ఉపయోగించేందుకు శిక్షణనిచ్చే కేంద్ర స్థాపనకు సంబంధించినది.

‘పసిడిలేడి’

భారతీయ జానపదగాథ ఆధారంగా సోవియట్ కార్టూన్ చిత్రం

లండన్, ఏప్రిల్ 1

ఒక భారతీయ జానపదగాథను ఆధారంచేసుకుని సోవియట్ ఫిలిం నిర్మాతలు చిన్న పిల్లలకోసం కార్టూను చిత్రాన్ని నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారని టాస్‌వార్తా సంస్థ ఒక ప్రకటనచేస్తోంది.

ఈచిత్రం పేరు “పసిడిలేడి” దీన్ని మాస్కో స్టూడియోస్‌వారు ఈ ఏడాదిలోనే నిర్మించసంకల్పించారు.

నానాదేశాల జానపద గాథలను తీసుకొని మాస్కో కార్టూన్ ఫిల్ము స్టూడియో వారు చిన్నపిల్లల కోసం అనేక చిత్రాలు నిర్మిస్తున్నారు. ఇంతవరకూ చైనా, కొరియా జానపద గాథల నన్నింటినీ కార్టూను ఫిల్ములు తీశారు.

ఇప్పుడు ‘పసిడిలేడి’ అనే పేరుతో ఒక భారతీయ జానపద గాథను కార్టూన్ చిత్రంగా నిర్మిస్తున్నారు.

ఈ కార్టూన్ చిత్ర నిర్మాత అతెనుకోవ్. అతడు టాస్ విలేఖరితో ఈ చిత్రాన్ని గురించి ముచ్చటిస్తూ సత్యం, నిజాయితీ, మంచితనం అన్నింటిని కొనియాడి జయించి తీరుతాయని, దురాశ, దుష్టస్వభావాలు దుఃఖానికి చేటు అనీ ఈ గాథ తెలియజేస్తుందన్నాడు. భారతీయ జానపద కథా విషయాల్లో ఒకటైన వన్యమృగాలతో మానవుని మచ్చిక అనేది ఈగాథకు ఇతివృత్తంగా వుంటుందని అన్నాడు. [illegible] భారతదేశ ప్రకృతి శోభ, శిల్పకళా కౌశలాన్ని సందర్భానుసారం ఈ చిత్రంలో చూపదలచుకొన్నట్లు ఆయన వెల్లడించాడు.

ఈ చిత్రానికి ప్రఖ్యాత సోవియట్ [illegible] యూరోవ్ స్కీ సంగీతాన్ని సమకూరుస్తున్నాడు.

భారతదేశంలోని పక్షుల పాటల బాణీలలో వుంటుంది ఈసంగీతం.

ఇదిగాక హంగేరీ, పోలండ్, రుమేనియా దేశాల జానపద గాథలకు సంబంధించిన కార్టూను చిత్రాలుకూడా మాస్కో స్టూడియోలో తయారవుతున్నాయి.

గమనిక

9 శ్రీ [illegible] యున్నా [illegible] ఆంధ్ర ప్రాంతీయ పత్రిక, విజయవాడ, వీరిని [illegible] గోప్య అప్పుల [illegible] వృత్తి 22/1142 నెంబరు డాబాలోనికి మార్పుచేయబడినది. పాలసీదారులు గమనింప ప్రార్థన.

అప్పనాటి భాస్కరరావు,
బ్రాంచిమేనేజరు, విజయవాడ 1-4-54.

3—4—54

నగరంలో సినిమాలు

శేష్ మహల్

కిద్దార్‌వారి చాచా చౌదరి
రాజాపరంజపే, దుర్గాఖోటే, శశికళ
ప్రతిరోజు 3 ఆటలు

శ్రీ మారుతి సినిమా

రాజకపూర్ నిర్మించిన
బూట్ పాలిష్
3 ఆటలు

శ్రీ విజయ టాకీస్

దావీదు విజయం
నాటక ప్రదర్శనము రాత్రి 10 గంటలకు

శ్రీదుర్గాకళామందిరం

చక్రపాణి
భానుమతి, నాగేశ్వరరావు,
3 వ వారం మూడు ఆటలు

శ్రీ లక్ష్మీ టాకీస్

అల్లుడుచేసిన అల్లరి
(అరవం) తెలుగు కామెంటరీతో
సావిత్రి, గణేశ్, సారంగపాణి.
మూడు ఆటలు

శ్రీ లీలామహల్

ప్రతిరోజూ 3 ఆటలు

శ్రీ ఈశ్వర మహల్

నిరుపేదలు
జమున, నాగేశ్వరరావు
5 వ వారం మూడు ఆటలు

గుంటూరు సినిమాలు

కృష్ణా మహల్

ఝాన్సీ కి రాణి
సొహ్రాబ్ మోడీ, మెహతాబ్
పంచరంగుల చిత్రం 3 ఆటలు

ప్రభాకర్ టాకీస్

అల్లుడుచేసిన అల్లరి
తెలుగు కామెంటరీతో
సావిత్రి, గణేశ్, సారంగపాణి.
మూడు ఆటలు

శ్రీ లక్ష్మీపిక్చర్ ప్యాలెస్

చక్రపాణి
నాగేశ్వరరావు, భానుమతి
3 వ వారం మూడు ఆటలు

దుర్గావిలాస్
మిలటరీ భోజనహోటల్
గవర్నరుపేట సెంటర్
విజయవాడ-2

వేలం నోటీసు

విజయవాడ సబ్‌కోర్టు, O.S. 284/52 నూజివీడు వల్లకట్టుచేను సమిష్టి వ్యవసాయక్షేత్రం తాలూకు సుమారు 70 యకరముల మామిడి తోటలోని పాలుపాలు మామిడికాయ కాపునున్నూ, మెట్ట మాగాని 1364 ఫసలీ కవులు హక్కున్నూ 11-4-1954 తారీఖున ఉదయం 9 గంటలు లగాయతు సదరు మామిడి తోటలో వేలం వేయబడును. వేలం పాట పాడదలచువారు ఒక్కొక్కరు రు. 250-0-0లు ధరావతు పాటకాలమందు నావద్ద డిపాజిట్టు చేయవలెను. వేలంపాట పూర్తగుచు వెంటనే వేలం పాట పాడినవారు మిగతా సొమ్ము చెల్లించవలెను. యితర విషయములు పాటకాలమందు నిర్ణయించబడును.

వేములపల్లి మధుసూధనదాసు,
రిసీవరు, విజయవాడ 2-4-1954.

మా ఖాతాదారులకు ఉగాది అభివందనములు
మన్నిక, అందములలో ఆకర్షణీయమైన



బన్ని గుడ్డలతో నవీన రకములలో తయారైనవి
పిల్లలకు, పెద్దలకు అందముగా సరిపోవు సైజులతో, ప్యాంటులు, కోటులు, బుష్‌కోటులు, షర్టులు, నిక్కర్లు, టేబిల్ గుడ్డలు, దిండుగలేబులు, ఉల్లెన్ ప్యాంటులు, సూటులు, ఇంకను అనేక రకముల దుస్తులలో మా ప్రత్యేక పనితనమును గమనింప కోరినాము.
H. O. ది ప్రకాష్ డ్రెస్ M. F. G. Co., బెంగుళూరు-2.
బ్రాంచి: 10/75 పార్కు—రోడ్డు, విజయవాడ-1.
డీలర్లకు ఉన్నతమైన డిస్కౌంటు ఇవ్వబడును.

సంపాదకుడు, ముద్రాపకుడు, ప్రచురణకర్త:— కాట్రగడ్డ రాజగోపాలరావు:— ముద్రణ : స్వతంత్ర [illegible] లిమిటెడ్‌వారి స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు, బకింగ్‌హాంపేట, విజయవాడ. సంపాదకవర్గం:— మోటూరు హనుమంతరావు, [అధ్యక్షులు] కంభంపాటి సత్యనారాయణ, కాట్రగడ్డ రాజగోపాలరావు